ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శనివారం 19 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 93 | పేజీలు 12 | వెల: 6.50


పాకిస్థాన్‌లోని కోహట్‌లో

## మసీదుపై ఉగ్ర దాడి

**ఐదుగురు పోలీసులతో సహా 15 మంది మృతి**

**50 మందికి పైగా తీవ్ర గాయాలు, పలువురి పరిస్థితి విషమం**

**పోలీసు కార్యాలయమే లక్ష్యంగా దాడి జరిగినట్లు అనుమానం**

**ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించలేదు**



2




2

భారత నౌకను

## ఢీకొన్న పాక్ నౌక

**పాక్ ప్రభుత్వ తీరుపై ఇండియా ఆగ్రహం**


Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar


## ఎల్‌నినో నేపథ్యంలో కేంద్రం సహకరించాలి

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించిన సీఎం రేవంత్



ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని కోరారు.శుక్రవారం దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శివరాజ్ సింగ్ చౌహాన్ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారిని కలిసి వర్షాభావం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

2

## మమత పార్టీ పేరు, గుర్తు గల్లంతు





**ఉప ఎన్నికల ముందు దీదీకి మరో భారీ షాక్**

**పోటీ నుంచి వైదొలగిన పార్టీ నందిగ్రామ్ అభ్యర్థి**

**ఇది చీకటి దినమని ఆరోపించిన మాజీ సీఎం**

ఉప ఎన్నికల ముందు దీదీకి మరో భారీ షాక్ వచ్చే నెల ఆరో తేదీన నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికలకు ముందు బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి గట్టి షాక్ తగిలింది. మూడు దశాబ్దాలుగా ఉన్న ఆమె పార్టీ పేరు, గుర్తు గల్లంతయ్యింది. ఆమెకు చెందిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ రెండుగా చీలిపోయిన క్రమంలో పార్టీ పేరు, గుర్తులను ఎన్నికల సంఘం స్తంభింప జేసింది.

**కోల్‌కతా, సెప్టెంబర్ 18 (సింగిడి)**

# భూ రాజకీయ లెక్కలు

## కేసీఆర్ కుటుంబంపై మళ్లీ తెరపైకి వచ్చిన ఆరోపణలు

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ కుటుంబ ఆస్తుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. గతంలో వినిపించిన ఆరోపణలకు కొత్త వ్యాఖ్యలు తోడయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ వర్గాలు వివరణలు ఇస్తుండగా.. బీఆర్ఎస్ నేతలు వాటిని ఖండిస్తూ ఎదురుదాడికి దిగుతున్నారు. దీంతో వ్యక్తిగత ఆస్తులు, కుటుంబ నేపథ్యం చుట్టూ రాజకీయ వేడి పెరిగింది.

- హైదరాబాద్ బ్యూరో, సింగిడి

**బీహార్ మూలాలపై రేవంత్ వ్యాఖ్యలతో దుమారం**

**ఫార్మ్‌హౌస్ ఆస్తులపై ప్రభుత్వం దర్యాప్తు**

**440 ఎకరాలపై కాంగ్రెస్ ప్రస్తావన**

**రేవంత్ కుటుంబంపైనా విచారణకు కేటీఆర్ సవాల్**

**ఆస్తుల చర్చ మధ్య అసలు ప్రజా అంశాలపై ప్రశ్నలు**

### బీహార్ మూలాలపై వ్యాఖ్యలు

కేసీఆర్ కుటుంబం తెలంగాణకు చెందిన స్థానిక భూస్వామ్య కుటుంబం కాదని.. బీహార్ ప్రాంతం నుంచి వలస వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ సెంటిమెంట్‌ను ఉపయోగించుకుని రాష్ట్రాన్ని దోచుకున్నారంటూ కూడా ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త వివాదానికి కారణమయ్యాయి.

### ఫార్మ్‌హౌస్ వ్యవహారం

కేసీఆర్ కుటుంబానికి తొమ్మిది జిల్లాల్లో సుమారు 440 ఎకరాల భూమి ఉందని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఎర్రవల్లి ఫార్మ్‌హౌస్ పరిసరాల్లోని ఆస్తులపై కూడా రేవంత్‌రెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం SIT దర్యాప్తుకు ఆదేశించింది. ఆరోపణల్లో వాస్తవాలను తేల్చేందుకు అధికారిక విచారణ కొనసాగుతోంది.

### పాత ముచ్చట్లు మళ్లీ

కేసీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ గతంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బండి సంజయ్ వంటి నేతలు చేసిన పాస్‌పోర్ట్ ఏజెన్సీ, బ్రోకర్ వ్యాఖ్యలు కూడా అప్పుడప్పుడు రాజకీయ ప్రచారంలో వినిపించాయి. అప్పటి ఆర్థిక ఇబ్బందులు, వడ్డీల వ్యవహారాల ప్రస్తావన కూడా ప్రత్యర్థుల విమర్శల్లో భాగమయ్యాయి. తాజా వివాదంతో ఆ పాత అంశాలు మరోసారి చర్చలోకి వచ్చాయి.



### బీఆర్ఎస్ ఎదురుదాడి

కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బీఆర్ఎస్ నేతలు రాజకీయ కక్ష సాధింపుగా అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వం తన హామీల అమలు, రైతు భరోసా, రుణమాఫీ వంటి అంశాలపై ఎదురవుతున్న ప్రశ్నల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ వ్యవహారాన్ని తెరపైకి తెస్తోందని కేటీఆర్, హరీశ్‌రావు ఆరోపిస్తున్నారు.

### రెండు వైపులా సవాళ్లు

కేసీఆర్ కుటుంబ ఆస్తులపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని బీఆర్ఎస్ చెబుతోంది. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని కేటీఆర్, హరీశ్‌రావు సవాల్ చేస్తున్నారు. దీంతో ఒకరి కుటుంబ ఆస్తులపై మరొకరు ప్రశ్నలు సంధించుకునే పరిస్థితి ఏర్పడింది.

### ప్రజల లెక్క వేరు

కేసీఆర్ కుటుంబం ఎక్కడి నుంచి వచ్చింది.. ఎంత ఆస్తి ఉంది.. ఒకప్పుడు ఎలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉంది అనే అంశాలు రాజకీయ చర్చకు రావచ్చు. కానీ సామాన్య పౌరుడి దృష్టిలో నిరుద్యోగం.. రైతుల కష్టాలు.. సంక్షేమ పథకాల అమలు.. విద్య, వైద్యం వంటి అంశాలే నిత్యజీవితాన్ని ప్రభావితం చేస్తాయి. అధికార, ప్రతిపక్షాలు పరస్పర ఆరోపణలు, ఆస్తుల లెక్కల్లో నిమగ్నమైతే.. ప్రజల సమస్యలకు దక్కాల్సిన ప్రాధాన్యం తగ్గిపోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నేతల ఆస్తుల లెక్కలు ఎప్పుడైనా తేల్చుకోవచ్చు.. కానీ ప్రజల సమస్యలకు పరిష్కారం మాత్రం ఆలస్యం కాకూడదన్నదే సామాన్యుల అభిప్రాయం.




## 22ఏ భూముల సమస్యలకు చెక్!

### హైలెవల్ కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

**పలు భూ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం**

**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

"ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణను 30 రోజుల్లో పరిష్కరించే దిశగా ముందు కెళ్తున్నాం. ఇందులో భాగంగా ఇవాళ మెమో జారీ చేశాం. 22ఏ కారణంగా ఎవరైతో ఇబ్బంది పడుతున్నారో, ఏ జీవో వల్ల రెగ్యులరైజేషన్ ఇతరత్రా పెండింగ్‌లో ఉన్నాయో వాటిని పరిష్కరిస్తున్నాం. 22ఏలో భాగంగా కొన్ని పనులు ఇప్పటికే కార్యరూపం దాల్చాయి. అందులో జీవో నంబర్ 118 కింద ఎల్బీనగర్లో 9,792 మంది ప్లాట్లు రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అక్కడి భూములకు సంబంధించి ఆ భూ యజమానులకు రేపటి నుంచే పట్టాల పంపిణీ చేయనున్నాం"

– పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

## నేటి నుంచి 24 వరకు భారీ వర్షాలు

**బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పెరగనున్న వానలు**

**ములుగు, ఖమ్మం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**రాష్ట్రంలో ఇప్పటివరకు 19 శాతం లోటు వర్షపాతం నమోదు**

వర్షాల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. రాష్ట్రంలో నేటి (19వ తేదీ) నుంచి 24వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

2




## టీజీఎస్ఆర్టీసీలో ఎన్నికల నగారా

### ఏళ్ల నిరీక్షణకు తెర

**అక్టోబర్ 9న పోలింగ్, 17న ఓట్ల లెక్కింపు**

**విడుదలైన ఆర్టీసీ ఎన్నికల పూర్తి షెడ్యూల్**

**2016లో చివరిసారిగా జరిగిన ఎన్నికలు**

**కార్మికుల వేతనాలపై చర్చించే అధికారం గుర్తింపు సంఘానికే**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం కార్మిక సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం ఎట్టకేలకు తేదీలను ఖరారు చేసింది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించి, అక్టోబర్ 17న ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది.

2

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

మా ఆస్తులు తీసుకుని

## వెయ్యి కోట్లు ఇవ్వండి

### రేవంత్‌కు కేటీఆర్ సవాల్

2

**బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న కేటీఆర్**

**హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రంబవళ్లు ప్రయత్నించామని వెల్లడి**

**కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు**




ఫార్ములా ఈ–రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం**

**భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి సంజయ్**

**కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య**

2





## చెల్లెలి చావుకు ప్రతీకారం

### అన్నంత పనీ చేసిన సంతోష్..

**హరిబాబును తానే చంపానన్న వైష్ణవి సోదరుడు**

**యూట్యూబర్ వైష్ణవి హత్య కేసు నిందితుడు, ఆమె భర్త హరిబాబు దారుణ హత్య**

**నిజామాబాద్‌లో నడిరోడ్డుపై కత్తితో నరికి చంపిన దుండగులు**

**తానే హత్య చేశానంటూ సెల్ఫీ వీడియో విడుదల చేసిన వైష్ణవి సోదరుడు సంతోష్**

**చెల్లి హత్యకు న్యాయం జరగలేదనే ప్రతీకారంతోనే చంపినట్లు వెల్లడి**

**ఆరు నెలల వ్యవధిలో రెండు హత్యలతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం**

2

యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో ప్రధాన నిందితుడైన ఆమె భర్త చిత్తరి హరిబాబు (26)ను తానే చంపానంటూ వైష్ణవి సోదరుడు సంతోష్ ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. నిజామాబాద్‌లో గురువారం పట్టపగలు నడిరోడ్డుపై దుండగులు హరిబాబును కిరాతకంగా నరికి చంపారు. ఈ హత్య జరిగిన కొన్ని గంటల్లోనే సంతోష్ ఈ వీడియోను విడుదల చేస్తూ పోలీసులకు లొంగిపోతున్నట్టు ప్రకటించాడు. వైష్ణవి హత్యకేసులో గత కొంతకాలంగా బెయిల్‌పై బయట ఉన్న హరిబాబు, తన తల్లితో కలిసి నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్‌లో నివాసం ఉంటున్నాడు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**



ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై 2

## అనర్హత వేటు

దానం నాగేందర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల కేసులో దానంపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు తేల్చిచెప్పింది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన నాటి నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడని స్పష్టం చేసింది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

### సుప్రీంకోర్టుకు వెళ్లను

దానం నాగేందర్ కీలక ప్రకటన

## దానం రాజీనామా చేయాలి: ఏలేటి

**కాంగ్రెస్ కుట్రలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు అని వ్యాఖ్య**

2

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 19 సెప్టెంబర్ 2026

# ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు

ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. స్పీకర్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును రద్దు చేసి అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటీషన్లపై హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. ఇద్దరి పిటీషన్లపై హైకోర్టులో ఆగష్టు 21వ తేదీన వాదనలు ముగిశాయి. సెప్టెంబర్ 16వ తేదీన ఉత్తర్వులు వెలువరించాల్సి ఉన్నప్పటికీ తీర్పు కాపీలు సిద్ధం కాకపోవడంతో సీజే ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు సుదీర్ఘ విచారణ నిర్వహించింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీ టికెట్ పై లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానంపై అనర్హతా వేటు వేయాలని వాదించారు.

**దానంపై అనర్హత వేటు వేసిన హైకోర్టు**

స్పీకర్ సరైన నిర్ణయం తీసుకోకపోతే నేరుగా జోక్యం




చేసుకొని ఎమ్మెల్యేపై వేటు వేసే అధికారం హైకోర్టుకు ఉందని వాదనలు వినిపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని గతంలో సుప్రీంకోర్టు కూడా పేర్కొందని వాదించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేయకపోయినా ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడంతోనే సహజంగా సభ్యత్వం పోయినట్లేనని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపు న్యాయవాది వాదించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసి పార్టీ మారినప్పటి నుంచి ఆయనకు శాసన సభ నుంచి అందిన జీతభత్యాలను తిరిగి చెల్లించేలా ఆదేశించాలని వాదించారు.

దానంపై స్పీకర్ ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ ఎలాంటి చర్యలు చేపట్టకుండా మార్చి 11వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాని కోరారు. దానం ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నారని శాసనసభలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారని ఆయన తరపు న్యాయవాది వాదించారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని దానం కలిశారని వాదించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫోటోలను చూసి.. అపోహతోనే పిటీషన్లు దాఖలు చేశారని దానం తరపు న్యాయవాది వాదించారు. ఇరు వైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసి ఉత్తర్వులు వెలువరించింది. దానంపై అనర్హతా వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

**మిగిలిన 8 మందిపైనా అనర్హతవేటు పడేవరకు పోరాటం**

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. సత్యమేవ జయతే అంటూ ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. పార్టీ ఫిరాయించిన మిగితా వారికీ ఇదే పరిస్థితి పడుతుందన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీకి విజయం లభించిందన్నారు. అమ్ముడుపోతే అనర్హత తప్పదని తాము గతంలోనే చెప్పామన్న కౌశిక్ రెడ్డి, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ అని పేర్కొన్నారు. మిగిలిన 8 మందిపైనా అనర్హత వేటు పడేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని కౌశిక్‌రెడ్డి తెలిపారు. అధికారం ఉందని విర్రవీగితే ఎదురుదెబ్బలు తప్పవని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో.. చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

## ఎల్‌నినో నేపథ్యంలో కేంద్రం సహకరించాలి

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అలాగే, తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు.

## పాకిస్థాన్‌లోని కోహట్‌లో మసీదుపై ఉగ్ర దాడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సింగిడి)**

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కోహట్ నగరంలో శుక్రవారం ఓ మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘోర ఘటనలో ఐదుగురు పోలీసు అధికారులతో సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 56 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసు కార్యాలయాల సముదాయానికి సమీపంలో ఉన్న మసీదులోకి ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో దూసుకెళ్లాడు. ఈ భారీ పేలుడు ధాటికి మసీదు కుప్పకూలగా, సమీపంలోని పోలీసు భవనం ప్రహరీ గోడ సైతం నేలమట్టమైంది. అనంతరం, తుపాకులతో సాయుధులైన మరో ఇద్దరు ఉగ్రవాదులు పోలీసు ప్రాంగణంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరపడంతో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. గాయపడిన వారిలో అధిక శాతం ప్రార్థనల కోసం వచ్చినవారేనని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ కిరాతక దాడిని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ దేశ అధ్యక్షుడు ఆకాంక్షించారు. పొరుగునే ఉన్న హంగూ జిల్లాలో గురువారం జరిగిన బాంబు దాడిలో ఆరుగురు సైనికులు మరణించిన మరుసటి రోజే ఈ దారుణం జరగడం కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో పాకిస్థానీ తాలిబన్లు (టీటీపీ) భద్రతా దళాలు, పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులను ముమ్మరం చేశారు. కాగా, తాజా దాడికి సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు.

## సిద్ధిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

సిద్ధిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

## మా ఆస్తులు తీసుకుని వెయ్యి కోట్లు ఇవ్వండి

"మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## టీజీఎస్‌ఆర్టీసీలో ఎన్నికల నగారా

ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వం వీటిని జరపలేదు. దీంతో కార్మికుల నిరీక్షణ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి గుర్తింపు పొందే సంఘానికే కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనల వంటి కీలక అంశాలపై యాజమాన్యంతో మరియు ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే హక్కు ఉంటుంది. అందుకే ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. రాష్ట్ర, రీజనల్ స్థాయిలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. రీజనల్ స్థాయిలో ఆఫీసర్ హోదాలో ఉన్నవారు మినహా, మిగిలిన కార్మికులు, ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తాజా షెడ్యూల్ విడుదలవడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది.

## నేటి నుంచి 24 వరకు భారీ వర్షాలు

బంగాళాఖాతంలో సెప్టెంబర్ 19 సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ హైదరాబాద్ కేంద్రం తెలిపింది. ఇది క్రమంగా బలపడి దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్ర తీరాల వైపు కదులుతుందని, దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పుంజుకుంటాయని అంచనా వేసింది.

ఈ వానాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కన్నా 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ కొత్త అల్పపీడనంతో ఆ లోటు కొంతవరకు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. నేడు, రేపు.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తర్వాతి రోజుల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ సహా మరిన్ని జిల్లాలకు ఈ హెచ్చరికలు వర్తించనున్నాయి.

హైదరాబాద్ నగరంలోనూ సాయంత్రం లేదా రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. రుతుపవనాల తిరోగమనం ఆలస్యమయ్యే సూచనలు ఉన్నాయని, అక్టోబర్ రెండో వారం వరకు వర్షాలు కొనసాగవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## చెల్లెలి చావుకు ప్రతీకారం

రాజరాజేంద్ర చౌరస్తాలో మొక్కజొన్న కంకులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం, దాహం వేయడంతో పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు నీళ్ల కోసం వెళ్లాడు. అదే సమయంలో కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేశారు. ఒక వ్యక్తి కారులో నుంచి దిగి, పదునైన ఆయుధంతో హరిబాబు తలపై విచక్షణారహితంగా నరికాడు. కేవలం 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. తీవ్ర రక్తస్రావంతో హరిబాబు అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

**చెల్లి హత్యకు ప్రతీకారంగానే..**

ఈ ఏడాది మార్చి 16న జగిత్యాల జిల్లా కోరుట్లలో తన భార్య, నాలుగు నెలల గర్భిణి అయిన వైష్ణవి (19)ని హరిబాబు గొంతు నులిమి, కత్తితో పొడిచి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ కేసులో అరెస్టయిన హరిబాబు, ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే, తన చెల్లి హత్య కేసులో ప్రభుత్వం న్యాయం చేయలేకపోయిందని, అందుకే తానే హరిబాబును హత్య చేశానని వైష్ణవి సోదరుడు సంతోష్ వీడియోలో తెలిపాడు. "నా చెల్లెలి హత్య కేసులో ప్రభుత్వం న్యాయం చేయలేకపోయింది. హరిబాబును నేనే చంపా. పోలీసులకు లొంగిపోతున్నా. నాకు శిక్ష పడకుండా ప్రజలు మద్దతు ఇవ్వాలి" అని సంతోష్ ఆ వీడియోలో కోరాడు.

**ప్రేమ, పెళ్లి నుంచి హత్యల వరకు..**

కోరుట్లకు చెందిన హరిబాబు, మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి ప్రభుత్వాసుపత్రిలో స్వీపర్లుగా పనిచేస్తూ ప్రేమించుకున్నారు. 14 నెలల క్రితం పెళ్లి చేసుకుని, వైష్ణవి పుట్టింట్లోనే కాపురం పెట్టారు. ఆమె యూట్యూబ్ రీల్స్ చేస్తూ గుర్తింపు తెచ్చుకుంది. అయితే, కొద్దికాలానికే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో, గర్భిణి అని కూడా చూడకుండా వైష్ణవిని హరిబాబు హత్య చేశాడు. వైష్ణవి తన కుటుంబంలో ఏకైక ఆడపిల్ల కావడంతో పాటు, ఆమెకు సొంత, సమీప బంధువుల కుమారులు కలిపి మొత్తం 13 మంది సోదరులు ఉన్నారు. వారందరికీ ఆమె అంటే ప్రాణం. ఆమె హత్యను జీర్ణించుకోలేకపోయిన సోదరులు, హరిబాబును కఠినంగా శిక్షించాలని, లేదంటే తామే చంపేస్తామని అప్పట్లో ప్రతినబూనారు. అన్నంత పనీ ఇప్పుడు చేయడం కోరుట్లలో చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలల వ్యవధిలో జరిగిన ఈ రెండు హత్యలు ఇరు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి.

## 22ఏ భూముల సమస్యలకు చెక్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

22ఏ నిషేధిత భూములతోపాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక అడుగేసింది. ఈ మేరకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను ఛైర్మన్‌గా నియమించింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌గాంధీ హనుమంతులను సభ్యులుగా ఉండనున్నారు. దీంతోపాటు 118 జీవో బాధితులకు ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎల్బీనగర్‌లో 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

**వారికి రేపటి నుంచి పట్టాల పంపిణీ**

భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా ముందుకెళ్తోంది. దీంతో ఇతర భూసంబంధిత సమస్యలనూ వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని ప్రకారం ఎల్బీనగర్‌లో జీవో నంబర్ 118 కింద అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల ఆయా కాలనీల్లో నివసిస్తున్న 9,700కు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ శనివారం నుంచే ప్రారంభమవుతుందని తెలిపింది. ఈ రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**సింగరేణి ఇళ్ల స్థలాలపై రేపే జీవో విడుదల**

సింగరేణి కాలనీ పరిధి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు అక్కడ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ మేరకు తగిన కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో ఇవాళ చర్చలు జరిపి, రేపే జీవోను విడుదల చేస్తామని ప్రకటించారు.

అదే సమయంలో సెక్షన్ 22ఏ కారణంగా హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ లేదా డీటీసీపీ వంటి సంబంధిత అధికారుల ద్వారా ఆమోదం పొందినప్పటికీ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన లేఅవుట్లను క్రమబద్ధీకరించే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా ఈ లేఅవుట్ల రెగ్యులరైజేషన్ ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శాసనసభ వేదికగా వెల్లడించారు.



## భారత నౌకను ఢీకొన్న పాక్ నౌక

### పాక్ ప్రభుత్వ తీరుపై ఇండియా ఆగ్రహం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (సింగిడి)**

భారత యుద్ధ నౌకను ఇటీవల పాక్ నౌక ఢీకొన్న సంగతి తెలిసిందే. ఈ నెల 15, సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఈ విషయంలో పాక్ ప్రభుత్వం స్పందించిన తీరుపై ఇండియా ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఈ అంశంపై శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పాక్ స్పందించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో పాకిస్తాన్ స్పందన సరిగ్గా లేదని, ఎప్పట్లాగే ధాటవేత ధోరణిని పాక్ అనుసరించిందన్నారు. అలాగే, పాకిస్తాన్ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ అరేబియా సముద్రంలో ఐఎన్ఎస్ కోల్‌కతా నౌక సాధారణంగా గస్తీ నిర్వహిస్తుండగా.. పాకిస్తాన్‌కు చెందిన నేవీ నౌక హునైన్ వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో పాక్ నౌక వ్యవహరించిన తీరు అనైతికంగా ఉంది. ఇది ఇండియా-పాకిస్తాన్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఆర్టికల్ 10ని ఉల్లంఘించడమే. ఏప్రిల్, 1991లో కుదిరిన ఒప్పందను అనుసరించి.. పీఎన్ఎస్ హునైన్ నౌక ప్రమాదకరంగా వ్యవహరించిందన్నారు.

అలాగే, అంతర్జాతీయ సముద్ర జలాల్లో ప్రమాదాలు జరగకుండా ఉన్న చట్టాల్ని కూడా పాకిస్తాన్ ఉల్లంఘించిందని రణధీర్ జైశ్వాల్ ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు.. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంపై పాకిస్తాన్ ఆర్మీ అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. భారత నౌకను ఢీకొన్న ఘటనలో పాకిస్తాన్ నౌక ఎక్కువగా ధ్వంసమైనట్లు సమాచారం. అయితే, భారత నౌకకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఘటన తర్వాత భారత నౌక సముద్ర జలాల్లో ఎప్పట్లాగే ప్రయాణించింది.

## పోర్టు ఆధారిత అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి

### ఒకేసారి 28 ప్రాజెక్టులు.. 20,000 ఉద్యోగాలు

**రూ.22,177 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం**

**ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 19,739 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు**


**ఏపీని హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం**

**అమరావతి, సెప్టెంబర్ 18 (సింగిడి)**

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.22,177.84 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో కొత్తగా 19,739 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన, ఐటీ, ఆహార శుద్ధి, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన ఈ ప్రతిపాదనలతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత అభివృద్ధిపై ఫోకస్**

ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు రెండు ప్రధాన లక్ష్యాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా (హబ్) తీర్చిదిద్దడంతో పాటు, తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థను (ఎకో సిస్టమ్)



నిర్మించాలని ఆదేశించారు. సెమీ కండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో పరిశోధన, డిజైన్, తయారీతో కూడిన పూర్తిస్థాయి ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ రంగాల్లో పెట్టుబడుల కోసం తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

**నైపుణ్యాభివృద్ధి, ఎగుమతులే లక్ష్యం**

రాష్ట్రంలోని యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. 10వ తరగతి నుంచే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకు స్కిల్ మ్యాపింగ్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల వల్ల తిరుపతి జిల్లా ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో, తూర్పుగోదావరి 12వ స్థానంలో నిలిచాయని, వీటిని టాప్-5కి తీసుకురావడమే లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వీటితో పాటు రేర్ ఎర్త్ మినరల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఆమోదం పొందిన ప్రాజెక్టులను కేవలం ఆరు నెలల వ్యవధిలో ప్రారంభించేలా పర్యవేక్షించాలని అధికారులకు గడువు విధించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి. నారాయణ, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టుకు వెళ్లను

### అనర్హత వేటుపై హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నట్టు తెలిపిన దానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును తాను గౌరవిస్తున్నట్టు పేర్కొన్న ఆయన, మీడియా సమావేశంలో తన తదుపరి నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, "ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే అన్ని విషయాలు తేల్చుకుంటాం. నాకు ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. అనేక పోరాటాల ద్వారానే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మద్దతుతో పోరాడి విజయం సాధిస్తాను" అని ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం కంటే రాజకీయంగానే దీనిని ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు. గతంలో స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, నాగేందర్ మాత్రం తన పోరాటాన్ని ప్రజాక్షేత్రానికే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారు.

## దానం రాజీనామా చేయాలి: ఏలేటి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (సింగిడి)**

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును బీజేపీ తీవ్రంగా స్వాగతించింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సుప్రీంకోర్టుకు వెళ్లే ప్రయత్నం చేయకుండా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దానం నాగేందర్ ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నందున, రేపే బీజేపీ తరఫున కేవియట్ పిటిషన్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకోవాలనే కాంగ్రెస్ కుట్రలకు ఈ తీర్పు చెంపపెట్టు అని, ఇప్పటికైనా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని పార్టీ మారిన మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా రాజీనామాలు చేయించి ఉపఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కూడా హైకోర్టు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇది ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. ఆరు నెలల వ్యవధిలోనే రాజ్యాంగబద్ధమైన తీర్పు రావడం చారిత్రాత్మకమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ తీరుకు ఈ తీర్పు సరైన సమాధానమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం, విలువలతో కూడిన రాజకీయం కోసం హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచాయని అభిప్రాయపడ్డారు.

## మమత పార్టీ పేరు, గుర్తు గల్లంతు

వచ్చే నెల ఆరో తేదీన నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికలకు ముందు బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి గట్టి షాక్ తగిలింది. మూడు దశాబ్దాలుగా ఉన్న ఆమె పార్టీ పేరు, గుర్తు గల్లంతయ్యింది. ఆమెకు చెందిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ రెండుగా చీలిపోయిన క్రమంలో పార్టీ పేరు, గుర్తులను ఎన్నికల సంఘం స్తంభింపజేసింది. ఈ క్రమంలో రాబోయే ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం మమతా బెనర్జీ, పార్టీ చీలిక వర్గానికి తాత్కాలికంగా కొత్తపేర్లు, ఎన్నికల గుర్తులను శుక్రవారం కేటాయించింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీకి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును, పార్టీ గుర్తుగా 'ఫుట్‌బాల్ ఆటగాడి'ని కేటాయించింది. అదే సమయంలో చీలిక వర్గానికి డెమొక్రాటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరును, పార్టీ గుర్తుగా కవరును కేటాయించింది. ఈ గుర్తులు కేవలం ఉప ఎన్నికల వరకేనని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాగా, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు మేలో ముగిసిన తర్వాత రితబ్రతా బెనర్జీ నేతృత్వంలో పార్టీని చీల్చి వేరే వర్గంగా ఏర్పడిన సంగతి తెలిసిందే. తమదే అసలైన టీఎంసీ అని అతను ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడంతో ఇప్పుడు దానిపై వివాదం నడుస్తున్నది.


ప్రభాతవం సింగిడి SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 19-9-2026

# ఘనంగా ప్రజపాలన దినోత్సవం

**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**మంత్రి దామోదర్ రాజనర్సింహ**





**సంగారెడ్డిబ్యూరో, సెప్టెంబర్ 18 ( సింగిడి):** ప్రజా పాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణం లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అధిథి గా తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజర య్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్. పి పరితోష్ పంకజ్ పాల్గొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన వారు వాటి ప్రయోజనాలను పొందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ దివ్యాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో, గ్లోబల్ గ్రీన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, సంగారెడ్డి వారి సహకారంతో సుమారు రూ. 13.10 లక్షల విలువ గల బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు, బ్యాటరీ ఆటోలను దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మొత్తం 21 బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్ల యూనిట్లు, ఒక బ్యాటరీ ఆటోను దివ్యాంగులకు అందజేశారు. దివ్యాంగులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు సహాయ పరికరాల పంపిణీ దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం, వివిధ సంస్థల సహకారంతో అర్హులైన దివ్యాంగులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని లలిత కుమారి తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన వేడుకలు

**జాతీయ జెండా ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు**




**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 18 ( సింగిడి):** రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (కొంగరకలాన్)లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, అట్టహాసం గా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి శ్రీధర్ బాబు అనంతరం అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. పుర ప్రముఖులు, అధికారులు, అనధికారులను కలిసి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించి అశువులు బాసిన అమరవీరులు శేఖర్‌రెడ్డి, సిరిపురం యాదగిరి, కాకి కుమార్, దినేష్ చంద్ర కుటుంబ సభ్యులను మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, శంషాబాద్ డీసీపీ బి. రాజేష్, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, కలెక్టరేట్ ఏఓ సునీల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులను పంపిణీ చేసిన మాజీ కౌన్సిలర్

**నాచారం, సెప్టెంబర్ 18 (సింగిడి):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అద్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో నాచారం సర్కిల్ నాచారం డివిజన్ సి.డి.ఎస్ భవనములో కొత్త రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం లో తుంగ తిరుపతి మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జావీద్ బాయ్, షాబుద్దీన్, రేషన్ డీలర్లు శ్రీనివాస్ రావు, భీమ్ రావ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



# వికారాబాద్‌లో ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ

**ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు రక్తదానం చేసిన నాయకులు**





**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 18 ( సింగిడి):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా వికారాబాద్ జిల్లాలో బీజేపీ నాయకులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు నవాబుపేట తదితర మండలాల్లో నాయకులు రక్తదాన శిభిరాలను నిర్వహించారు. రక్తదానం చేసి అభిమానాన్ని చాటారు. ఈ కార్యక్రమం బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్, మరియు సేవా సంకల్ప్ అభియాన్ కన్వీనర్ వివేకానంద రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వడ్ల నందు రక్తదానం చేసి, సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు శివరాజ్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, యువమోర్చా అధ్యక్షుల చరణ్ రెడ్డి,, మున్సిపల్ కౌన్సిలర్ లు అనిల్ యాదవ్, స్రవంతి శ్యామ్ రెడ్డి, లావణ్య సురేందర్ బాబు, పాండుగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్ రెడ్డి, ధారూర్ మండలం బీజేపీ అధ్యక్షులు రాజ్ నాయక్, ధార్మిక సెల్ జిల్లా అధ్యక్షులు వెంకట్ రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు యాష్మీ శిరీష, యువ మోరాచా నాయకులు సాయి, హర్ష, అభిలాష్ రెడ్డి, నవాబుపేటలో కళ్యాణ్ రావు, శ్రీకాంత్ రెడ్డి, మధుకర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు. సేవే సంకల్పం దేశమే లక్ష్యం అని 103 మంది నరేంద్ర మోదీ అభిమానులు రక్త దానం చేశారు.

# శివ సాగర్ చెరువు నీటి నిలువలను పరిశీలించిన్ల కలెక్టర్, మున్సిపల్ ఛైర్పర్సన్



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (సింగిడి):** జిల్లా కేంద్రం ప్రజలకు చాలా సంవత్సరాలనుండి మంచినీటిని అందించిన శివారెడ్డి పేట రెవిన్యూ పరిధిలో ని శివసాగర్ నీటి మట్టాన్ని గురువారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అర్థ సుధాకర్ రెడ్డిలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున్ గౌడ్, రాకేష్ హీరేకర్, వినోద్, కాంగ్రెస్ నాయకులు నాగరాజు ముదిరాజ్, మున్నూరు శ్రీకాంత్, మురళి, గంగులు యాదవ్, తదితరులు ఉన్నారు.

# బూమ్స్ స్పోర్ట్స్ అకాడమీలో ఘనంగా కరాటే ఛాంపియన్షిప్ విజయోత్సవ వేడుకలు

**విజయతలను ఘనంగా సత్కరించిన సొంటి రెడ్డి పున్నారెడ్డి**

**బెంగళూరు నేషనల్ కరాటే ఛాంపియన**




**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 ( సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ చిత్తారమ్మ దేవి నగర్ ప్రాంతంలోని మా బూమ్స్ స్పోర్ట్స్ అకాడమీ లో శిక్షణ పొందుతున్న కరాటే విద్యార్థులు బెంగళూరు నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ అవార్డులు సొంతం చేసుకోవడంతో భూమ్ స్పోర్ట్స్ అకాడమీ లో విజేతలను ఘనంగా సత్కరించే వేడుకలు నిర్వహించారు. బూమ్స్ స్పోర్ట్స్ అకాడమీ లో శిక్షణ పొందిన కరాటే, కుమిట్ విభాగాలలో నిర్వహించిన పోటీలలో జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్షిప్లో అద్భుతమైన ప్రతిభను ఘనపరిచి విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సత్కరించుటకు మాజీ టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందిస్తూ శుభాశీస్సులు అందజేశారు. బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే కుమిట్ విభాగాలలో నిర్వహించిన పోటీలకు 16 మంది విద్యార్థులు బూమ్స్ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా పోటీలలో పాల్గొనుటకు వెళ్లారు. కరాటే కుమిట్ విభాగాలలో పోటీపడిన 16 మంది కుస్తీదారులు ఇతర పోటీదారులతో పోటీపడి తమ నైపుణ్యాలను ప్రదర్శించి 28 పథకాలు సాధించి బూమ్స్ స్పోర్ట్స్ అకాడమీకి గర్వ కారణంగా నిలిచారని సొంటి రెడ్డి పున్నారెడ్డి విజేతలను అభినందిస్తూ ఆశీర్వదించారు. ఈ అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకొని స్వస్థలాలకు చేరుకున్న విజేతలను సత్కరించుటకు మా అకాడమీలో ప్రత్యేకంగా విజయోత్సవ సన్మాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని సొంటి రెడ్డి పున్నారెడ్డి వివరించారు. బెంగళూరులో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన తెలంగాణ రాష్ట్ర కీర్తి పతాకాలను జాతీయస్థాయిలో నిలిపి విజయతేజులైన మా విద్యార్థులను ఘనంగా సన్మానించి, వారి కృషిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, అందుకు కావలసిన శిక్షణను ఎప్పటికప్పుడు కాలానుగుణంగా నేర్చుకొని విశ్వ విజేతలుగా నిలిచేలా నైపుణ్యాలు పెంపొందింప చేసుకోవాలని సూచించారు. ఈ విజయానికి కృషి చేసిన కృష్ణ మాస్టర్, విద్యార్థులు, తల్లిదండ్రులకు సొంటి రెడ్డి పున్నారెడ్డి హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

# మీసేవ నిర్వాహకుల సమస్యలపై ఈ-జిల్లా మేనేజర్‌తో TGMF నాయకుల చర్చ

**సిద్దిపేట ప్రతినిధి, సెప్టెంబర్ 18 (సింగిడి):** ఇటీవల నూతనంగా ఏర్పాటైన తెలంగాణ మీసేవ ఫెడరేషన్ (TGMF) సిద్దిపేట జిల్లా కమిటీ, సిద్దిపేట జిల్లా ఈ-జిల్లా మేనేజర్ కమటం ఆనంద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మీసేవ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఈ-జిల్లా మేనేజర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. TGMF జిల్లా అధ్యక్షుడు చుక్క భరత్, ప్రధాన కార్యదర్శి అనంతారం నగేష్, TGMF రాష్ట్ర కమిటీ సభ్యులు గన్నె దినేష్ రెడ్డి, మాచర్ల ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ... మీసేవ నిర్వాహకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఈ-జిల్లా మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మీసేవ నిర్వాహకుల సమస్యల పరిష్కారం కోసం TGMF జిల్లా కమిటీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, సంపత్, రమేష్, మహేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ

**పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఎంపీడీవో యాదగిరి**






**రామచంద్రాపురం, సెప్టెంబర్ 18 (సింగిడి):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజాపరిషత్ అధికారి యాదగిరి జాతీయ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించా రు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం అధికారులు, కార్యాలయ సిబ్బంది జాతీయ జెండాకు గౌరవం సమర్పించారు. అనంతరం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు పాల్గొని దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను సకాలంలో అందించడం, వారి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మండల స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని, ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా ప్రతి శాఖ తన పరిధిలో బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, విజ్ఞప్తులను అధికారులు సానుకూలంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించడమే ప్రభుత్వ కార్యాలయాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, నాయబ్ తహసీల్దార్ షఫీ, మండల విద్యాధికారి నాగేశ్వరరావు నాయక్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, ఎస్‌టీఓ రాజారెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ అనంతరావు, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, టైపిస్ట్ హుస్సేన్ పాల్గొన్నారు.

# శ్రీ విరాట్ విశ్వకర్మ భగవన్ యగ్న మహోత్సవాన్ని అధికారికాంగా జరపడం సంతోషంగా ఉంది

**జిల్లా వెనుకబడిన తగతుల అభివృద్ధి అధికారి శ్రీ. ఎ. జగదీష్**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 18 (సింగిడి):** విశ్వబ్రహ్మణుల/విశ్వకర్మ కులస్తుల ఆర్దిక స్దితిగతులను దృష్టిలో పెట్టుకోని ప్రభుత్వము వారి సంక్షేమానికి పెద్దపీటను వెయడానికి ప్రభుత్వము ప్రయత్నిస్తుందని అందులో బాగంగా రాష్ట్ర ప్రభుత్వము శ్రీ విరాట్ విశ్వకర్మ భగవన్ యగ్న మహోత్సవాన్ని అధికారికాంగా జరపడము సంతోషంగా ఉందని జిల్లా వెనుకబడిన తగతుల అభివృద్ధి అధికారి శ్రీ. ఎ. జగదీష్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభి వృద్ధి శాఖ ఆధ్వర్యములో జయంతి అధికారికంగా విశ్వకర్మ బగవాన్ కు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మరియు జిల్లా విశ్వకర్మ అధ్యక్షులు శ్రీ. అశోక్ చారి జిల్లా అధ్యక్షులు మరియు అంజనేయులు చారి జిల్లా అధ్యక్షులు మాట్లాడు తూ ప్రభుత్వము అధికారికంగా జయంతిని నిర్వహిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞ తలు తేలిపినారు. మరియు వారికోసము జిల్లాలో సంఘ భవనము కెటాయిం చాలని కోరినారు. ఈ కార్యక్రమములో శ్రీ. బ్రహ్మము చారి, వైస్ ప్రసిడెంట్, శ్రీ నాగభూశనము చారి, జనరల్ సెక్రెటరీ, శ్రీ మెహన్ చారి, పాండు చారి, నరేందర్ చారి, వెంకటాచారి, శ్రీనివాస్ చారి శ్రీ, క్రిష్ణ చారిగారి మరియు విశ్వకర్మ సంఘ నాయకులు పాల్గోని చిత్రపటానికి పూజలు చేసినారు. ఈ కార్యక్రమములో వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీమతి అమర్ జ్యోతి మరియు కార్యాలయ సిబ్బంది. పాల్గోన్నారు.



# నాగారంలో ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

**కీసర, సెప్టెంబర్ 18 (సింగిడి):** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ 5 పరిధిలో పెద్ద ఎత్తున ప్రధా న మంత్రి మోడీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది. దీనిలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలు అందరూ రక్తదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ప్రధానమంత్రి మోడీ జన్మదినం సందర్భంగా ఆయనకు కేక్ కట్ చేశారు. అలాగే ఆయన 13 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు ప్రధాన మంత్రిగా రాజకీయ జీవితంలో ఇంకా ఎన్నో పద వులు అధిరోహించాలని, ఇంకా రాజకీయంగా మన భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దే విధంగా ఆయనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్ రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్ర రెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ వేణుగోపాల్, మునిగంటి సురేష్, కౌకుట్ల రాహుల్ రెడ్డి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 5 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పోలీసు అధికారులు

**కీసర సిఐ, ఎస్ఐ అరెస్ట్**

**కీసర, సెప్టెంబర్ 18 (సింగిడి):** కీసర పోలీస్‌స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. నిర్వహించిన ట్రాప్‌లో ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆంజనే యులు లంచం కేసులో పట్టుబడ్డారు. వివరాల ప్రకారం..పీడీఎస్ బియ్యం కేసుకు సంబంధించి బాధితుడికి స్టేషన్ బెయిల్ ఇప్పించడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు రూ. 10 డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడుతో ఎస్సై, సీఐ కలిసి రూ"8.35 లక్షలకు ఒప్పందం కుదుర్చుకునట్లు సమాచారం. అయితే ఈ నెల 2 న బాధితుడి నుండి 3.50 లక్షల రూపాయలు తీసుకున్నట్లు తెలిసింది, మిగతా డబ్బుల కోసం పోలీస్ అధికారుల వేధింపులు భరించ లేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు పక్క సమాచారం ప్రకారం...మిగతా 5 లక్షలు తీసుకునేందుకు గురువారం రాత్రి 12 గంటల ప్రాంతంలో కీసర పెద్ద చెరువు వద్దకు వచ్చిన ఎస్సై, సీఐని, ఏసీబీ అధికారులు వలవేసి పట్టుకున్నా రు. కీసర పోలీస్ స్టేషన్లో ఏసీబీ అధికారులు తనిఖీ లు చేపట్టారు. వీటితో పాటు పోలీస్ అధికారుల ఇళ్లలోనూ సోదాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.



# విమాన రంగంపై.. విజ్ఞానం పెంపొందించుకోవాలి

**సిఆర్పిఎఫ్ పాఠశాలలో బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్**

**సాంకేతిక నైపుణ్యాలతో నూతన ఆవిష్కరణలు సృష్టించాలి**

**బోయింగ్ సుకన్య స్టెమ్ సేవలు అభినందనీయం**

**సిఆర్పిఎఫ్ డీజీ జి.పి. సింగ్**





**జవహర్ నగర్, సెప్టెంబర్ 18 ( సింగిడి):** విమాన రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని బాలికలు విజ్ఞానాన్ని పెంపొందిం చుకొని ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేయాలని సిఆర్పిఎఫ్ డిజి జి.పి. సింగ్ పిలుపునిచ్చారు. మల్కా జిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని కీసర సర్కిల్ చంద్రపురి కాలనీ డివిజన్ అరుంధతి నగర్ సిఆర్పిఎఫ్ క్యాంపస్లో బోయింగ్ ఇండియా సౌత్ ఏషియా అధ్యక్షుడు సలీం గుప్తే ఆధ్వర్యంలో బోయిం గ్ సుకన్య స్టెమ్ ల్యాబ్ ను గురువారం సిఆర్పిఎఫ్ సింగ్ సమక్షంలో ప్రారంభో త్సవ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఆర్పిఎఫ్ డిజి జి. పి సింగ్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు ఆచరణాత్మక ప్రత్యక్ష అభ్యాసంతో సైన్స్ టెక్నాలజీని అందుపుచ్చుకోవచ్చునని బాలికలు ఏవియేషన్లో దూసుకుపోవాలని వారి కోసం ప్రత్యేకంగా 1.25 కోట్ల వరకు స్కాలర్షిప్ సహాయం బోయింగ్ సంస్థ అందించనుందని అన్నారు. మహిళ లు నేల నుంచి నింగి వరకు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. ఆధునిక సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని నూతన ఆవిష్కరణల సృష్టికర్తలుగా విద్యార్థులు సంసిద్ధులు కావాలని పేర్కొన్నారు. బోయింగ్ సుకన్య స్టెమ్ సంస్థ సేవలు అభినందనీయమ న్నారు. విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులను సింగ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సౌత్ సెక్టార్ ఐ జి పి విక్రమ్, డిఐజిపి వీర్రాజు, ప్రవీణ, యజ్ఞం బట్, మనీష్ కుమార్, రాజేంద్రప్రసాద్ డిసి, సిఆర్పిఎఫ్ పాఠశాల ప్రిన్సిపల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ ఆశాజీ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బౌరంపేటలో ఘనంగా హైదరాబాద్ సంస్థాన్

# తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

**భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ మండపాల వద్ద జాతీయ పతాక ఆవిష్కరణ**






**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ సంస్థాన్ తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేన యూత్, భ్రమరాంబ యూత్, శివశక్తి యూత్, నవభారత్ యూత్, మరియమ్మ యూత్, అంబేద్కర్ యూత్, కీర్తి హోమ్స్, ల్యాండ్ మార్క్ 2, ప్రణీత్ బ్లూమ్స్, తదితర ప్రాంతాలలో జాతీయ పతాకం ఆవిష్కరించి వందేమాతరం గీతం పూర్తిగా ఆలపించి స్వతంత్ర సమరయోధులను స్మరించుకున్నారు. వందేమాతర ఉద్యమం ప్రారంభమై 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వందేమాతరం గీతం పూర్తిస్థాయిలో ఆలపించి గీత రచయిత బకించంద్ర చటర్జీని స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలు భలి తీసుకుంటున్న నిజాం రజాకార్ల రాక్షస పాలన నుండి నాటి హైదరాబాద్ సంస్థాన్ కు (తెలంగాణ) విమోచన కల్పించడానికి ప్రత్యేక చొరవ తీసుకొన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వీరోచిత నిర్ణయాలను (పోరాట పట్టిమను ) స్మరించుకున్నారు. నేటి సమాజంలో ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకొంటున్నాం అంటే అందుకు ముఖ్య కారకులు స్వాతంత్ర్య పోరాట యోధులు బాలగంగాధర్ తిలక్ నాడు బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని పాలిస్తున్నప్పుడు 144 సెక్షన్ పెట్టి ఎక్కడ నలుగురు కనిపించిన జైల్లో వేసేవారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించాలి అంటే ఇలా కుదరదని తలచి ఇండ్లలోనే నిర్వహించుకొనే గణేష్ పూజలు గ్రామాలలో బహిరంగంగా వినాయక ఉత్సవాలు నిర్వహించి సమాజాన్ని జాగృతం చేసి స్వతంత్ర ఉద్యమం ఉధృతం కావడానికి ప్రధాన కారకులు బాల గంగాధర్ తిలక్ ను కొనియాడారు. బౌరంపేట్ లో భగవాన్ శ్రీ విశ్వకర్మ జయంతి, శ్రీ సంత్ గురు రవిదాస్ 650 జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో దుండిగల్ సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ పీసరి కృష్ణారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ గోనె మల్లారెడ్డి, వందేమాతరం ఇంచార్జి దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పీసరి బాలమణి కృష్ణారెడ్డి, మాజీ వార్డు సభ్యులు ఎస్ వి సురేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు డి సీతారాంరెడ్డి, కమ్మరి రమేష్ చారి, నవీన్ కుమార్, జెక్కాని కిషోర్ గుప్తా, తలారి బాలకృష్ణ, ఎస్ మహేష్, తలారి ప్రశాంత్, నల్ల రాజిరెడ్డి, గోనె విజయ్ రెడ్డి, ఆకుల శ్రీనివాస్, చింతకింది నరేష్, తదితరులు పాల్గొన్నారు.

Editorial

# ఎడిటోరియల్

# 300 ఎకరాలపై నిగ్గు తేల్చుతారా... నీరుగారుస్తారా?

## ధరణి ప్రక్షాళన, ప్రత్యేక విచారణ బృందం!



శాసనసభ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారవించిన ప్రసంగం ఒక తీవ్రమైన రాజకీయ రణభేరిని తలపించింది. గత ప్రభుత్వ హయాంలో 'ధరణి' పేరిట వేలాది ఎకరాల నేలను బొక్కేసిన భూ రాబందుల ముసుగులను చీల్చి చెండాడతామని, పూర్వపు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారి ఫామ్‌హౌస్‌లోని ఏడు వందల ఎకరాలలో మూడు వందల ఎకరాలు ప్రభుత్వానికి చెందిన ఆక్రమిత భూమేనని, దాన్ని వెలికితీసి స్వాధీనం చేసుకుంటామని ఆయన చేసిన ఉద్ఘాటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ అక్రమాల తీరుతెన్నులను విప్పి చెప్పేందుకు ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పైకి ఎంతటి వీరోచితమైన అడుగుగా కనిపిస్తున్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే అనేక అనుమానాలు, విమర్శలు, రాజకీయ శంకలు వ్యక్తమవుతున్నాయి. పదేళ్ల భూ దోపిడీపై పోరాటం ప్రకటిస్తున్నామని చెప్తున్న ఈ ప్రభుత్వం, నిజంగానే ఆక్రమణదారుల గుండెల్లో నిద్రపోతుందా? లేక గత పాలకుల తరహాలోనే కేవలం విమర్శల విన్యాసాలతో సమయాన్ని వృథా చేస్తూ ప్రజల కళ్లల్లో దుమ్ము కొడుతుందా?

### రాజకీయ రచ్చ తప్ప.. పక్కా ఆధారాల వేట ఏది?

అధికారంలో ఉన్న పాలకులకు సభ వేదికగా ఆవేశపూరిత ఉపన్యాసాలు దంచడం కొత్తేమీ కాదు. తెలంగాణ రాష్ట్రం అవతరించిన నాటి నుంచి నేటి వరకు దాదాపు రెండున్నర కోట్ల ఎకరాల భూముల వివరాలను, ప్రజల సున్నితమైన వ్యక్తిగత సమచారాన్ని విదేశీ కంపెనీల చేతుల్లో పెట్టి దోచిపెట్టారని సభలో ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రజల ఆస్తులు పరుల పాలయ్యాయని సత్య దూరం కాని నిజాన్ని బిగ్గరగా చెప్పారు. అయితే, ఇక్కడ ఉద్భవించే ప్రశ్న ఏమిటంటే.. అధికార పీఠంపై కూర్చొని తొమ్మిది నెలల కాలం గడుస్తున్నా, ఆ భూ బకాసురుల పేర్లను అధికారికంగా ఎందుకు బయటపెట్టలేకపోతున్నారు? కేసీఆర్ గారి ఫామ్‌హౌస్‌లో మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్న తీవ్రమైన ఆరోపణ వార్తాపత్రికలలో సంచలనంగా మారడానికి బాగానే ఉపయోగపడుతుంది. కానీ, ప్రభుత్వ వద్ద తగిన ఆధారాలు, భూముల చిట్టా స్పష్టంగా ఉన్నప్పుడు క్షణం ఆలస్యం చేయకుండా చట్టపరమైన నోటీసులు ఇచ్చి, ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? అధికారిక మైకుల ముందు బాంబులు పేల్చడం రాజకీయ ప్రయోజనానికి తప్ప, పక్కా చట్టబద్ధమైన చర్యలు లేనప్పుడు ఇవన్నీ కేవలం నాటకాలుగానే మిగిలిపోతాయి.

### ప్రత్యేక విచారణ బృందం కాలయాపనకేనా?

ఏ ప్రభుత్వం వచ్చినా ఏదైనా పెద్ద సంచలనాత్మక విషయం ఎదురైనప్పుడు ముందుకు తెచ్చే ఏకైక అస్త్రం "ప్రత్యేక విచారణ బృందం". కానీ చరిత్రను ఒకసారి తిరగేస్తే, విచారణ బృందం అంటే నిజాయితీతో కూడిన విచారణ కాదు, సమస్యను మరుగున పడేసే నిదాన ప్రక్రియ అని ప్రజలకు తేటతెల్లమైపోయింది. గతంలో జరిగిన అనేక భారీ కుంభకోణాలపై వేసిన విచారణ బృందాల నివేదికలు ఏమయ్యాయో, వాటి ఫలితాలు ఏ మూలన పడ్డాయో అందరికీ తెలిసిన విషయమే. రాజకీయనాయకులు పరస్పరం బురద చల్లుకోవడం పూర్తి కాగానే, వాతావరణం చల్లారిన తర్వాత ఆ దస్త్రాలు ప్రభుత్వ కార్యాలయాల అటకపై దుమ్ము పట్టిపోవడం పరిపాటిగా మారింది. ధరణి అక్రమాలపై వేసే విచారణ బృందం కూడా కేవలం గత పాలకులపై ఒత్తిడి పెంచడానికి, రాబోయే ఎన్నికలలో లబ్ధి పొందడానికి వాడుకునే ఒక రాజకీయాస్త్రంగా మారదా అని సామాన్యుడు ప్రశ్నిస్తున్నాడు. నిజంగానే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ఒక నిర్దిష్టమైన గడువు విధించి ఆ నివేదికను ప్రజల ముందు ఎందుకు ఉంచకూడదు?

### కొత్త చట్టాల మెరుపులు.. బలిపీఠంపై సన్నకారు రైతులు!

శాసనసభ వేదికగా విమర్శల వర్షం కురిపిస్తున్న నాయకులకు క్షేత్రస్థాయిలో సామాన్య రైతు పడుతున్న అవస్థలు కనిపిస్తున్నాయా? ధరణి స్థానంలో 'భూ భారతి' చట్టాన్ని తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నా, నేటికీ రిజిస్ట్రేషన్ల కార్యాలయాల చుట్టూ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న రైతులకు ఏమాత్రం ఉపశమనం లభించలేదు. నిషేధిత భూముల జాబితా పరిధిని ముప్పై లక్షల ఎకరాల నుంచి మూడు లక్షల డెబ్బై మూడు వేల ఎకరాలకు తగ్గించామని ఘనంగా అంకెలు చెబుతున్నారు. కానీ, ఇప్పటికీ లక్షలాది మంది పేద రైతులు తమ భూములకు హక్కులు లేక, బ్యాంకుల నుంచి పంట రుణాలు అందక, కష్టకాలంలో భూములను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
నిషేధిత జాబితాపై నిర్ణయాధికారాన్ని కేవలం కలెక్టర్లకే కట్టబెట్టడం ద్వారా రెవెన్యూ వ్యవస్థలో మళ్లీ పాతకాలపు అధికారం, లంచగొండితనం శృతిమించే ప్రమాదం ఉంది. ఒక రెవెన్యూ అధికారి దయాదాక్షిణ్యాలపై రైతు భవిష్యత్తు ఆధారపడేలా చేయడం ఏ రకమైన ప్రక్షాళన? అరవై రోజుల్లో విన్నపం, తొంబై రోజుల్లో పునఃపరిశీలన అంటూ కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ తిప్పే ప్రతిపాదనలు సగటు పౌరుడికి కొత్త నరకాన్ని చూపిస్తున్నాయి.

### భయపెట్టడం కాదు.. బాధ్యత నెరవేర్చండి!

తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుని అధికారాన్ని ఇచ్చింది కేవలం సభల్లో తిట్ల పురాణాలు, మునుపటి పాలకుల వైఫల్యాల వల్ల కలిగే వినోదం కోసం కాదు. నిరుపేదల భూములను అక్రమంగా కొల్లగొట్టిన వారు ఎంతటి ఘటనానుభావులైనా, పూర్వపు ముఖ్యమంత్రి అయినా, మంత్రులైనా చట్టం ముందు మోకరిల్లేలా చేయడమే ప్రజా ప్రభుత్వ బాధ్యత. ధరణి పేరుతో జరిగిన విదేశీ కంపెనీల దోపిడీపై నిజంగా నిజాయితీ ఉంటే, కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా న్యాయస్థానపు న్యాయమూర్తితో నిష్పాక్షిక విచారణ జరిపించాలి.
రాజకీయ కక్షసాధింపుల కోసం, ప్రత్యర్థులను భయపెట్టడానికి భూ సమస్యలను వాడుకోవడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఇకనైనా మైకుల ముందు మాటల యుద్ధాలు ఆపాలి. కేసీఆర్ గారి ఫామ్‌హౌస్‌లోని మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూమితో సహా, రాష్ట్రంలో ఆక్రమణకు గురైన ప్రతీ ఒక ఎకరం భూమిని స్వాధీనం చేసుకుని, నిజమైన బాధితులకు తిరిగి అప్పగించినప్పుడే ఈ ప్రభుత్వ మాటలకు విలువ ఉంటుంది. లేదంటే, ఇది కూడా "చేసేది శూన్యం.. చెప్పేది గంభీరం" అన్న చందంగానే మిగిలిపోతుంది!

**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863**



# విలువల కోసం జీవితాంతం పాటుపడిన కాటం

## నేడు కాటం లక్ష్మీ నారాయణ జయంతి

**ఆయన నిజాం వ్యతిరేక పోరాటయోధులలో ప్రముఖుడు. స్వార్థం అనే పదాన్ని దగ్గరకు రానీయకుండా, రాజకీయ పదవులకు ఏనాడూ పాకులాడ కుండా, కేవలం ప్రజలకు, విలువల కొరకు ఎంతటి వారినైనా, ఎదిరించి ధైర్యంగా నిర్మొహ మాటంగా నిలబడటం ఆయనకే చెల్లింది. సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించక పోవడాన్ని అవమానంగా భావించి, పోరాడి సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభింప చేసిన ఘనత ఆయనదే. హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించిన కృషీవలుడు ఆయన. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని కోర్టు తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకు లందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించిన గొప్పతనం ఆయనదే. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. ఆయనే పోరాట పటిమకు, కార్యదీక్ష తకు నిలువుటద్దం గా నిలిచిన యోధుడు కాటం లక్ష్మీ నారాయణ.**



కాటం లక్ష్మీనారాయణ (సెప్టెంబరు 19, 1924 – ఫిబ్రవరి 25, 2010) రంగారెడ్డి జిల్లా శంషాబాదులో, లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు 1924 వ సంవత్సరంలో సెప్టెంబరు 19 న జన్మించారు. అయన తాత కాటం నారాయణ స్థానిక జమీందారుల అకృత్యాలను ఎదిరించిన దైర్యవంతులు. తాత పేరుతో పాటు దైర్య సాహసాలు కూడా పుణికి తెచ్చు కున్నారు. 1942 అక్టోబరు 12 న బూర్గుల రామకృష్ణారావు చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండులో సత్యాగ్రహం చేయడానికి సన్నాహాలు చేసిన సందర్భంలో నైజాము పోలీసులు బూర్గుల రామకృష్ణారావును, లక్ష్మీ నారాయణను అరెస్ట్ చేశారు. అప్పటికి నారాయణ వయస్సు పంతొమ్మిది. అప్పటి నుండి లక్ష్మినారాయణ బూర్గుల రామకృష్ణారావుని గురువుగా బావించారు. పోలీసులు లక్ష్మినారాయణను ఏడు నెలల పాటు చెంచల్ గూడ జైల్లో వుంచారు. తర్వాత లక్ష్మి నారాయణ న్యాయవిద్య పూర్తి చేసి బూర్గుల వారి వద్దనే జూనియర్ లాయర్ గా చేరారు. బూర్గులతో పాటు అన్ని కార్య కలాపలాలలో క్రియా శీలక పాత్ర పోషించారు. ఆనాటి సామాజికి సమస్యలలో కూడా పాలు పంచుకున్నారు. నిజాం ప్రభుత్య ఆజ్ఞలను దిక్కరించి హింది పాఠశాలను స్థాపించారు. ఖాది వ్యాప్తి, దళిత జనోద్ధరణ వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆచార్య రంగా ప్రేరణతో 1945లో లక్ష్మినారాయణ హైదరాబాదు యువ జన కాంగ్రేసు స్థాపించి తాను ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. లక్ష్మి నారాయణ ఏదో ఒక ఉద్యమంలో పాల్గొనడం, అరెస్ట్ కావడం, తిరిగి రావడం, మళ్లి జైలుకెళ్లడం నిత్య కృత్యంగా మారింది.
నిజాం పాలన అంతమై, నూతన రాష్ట్రం ఏర్పాటు అయ్యాక, ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి 1949 డిసెంబరులో "జనత" పేరుతో ఒక పత్రికను ప్రారంబించారు. గతంలో రజాకార్ల చేతిలో హతుడైన షోయబుల్లా ఖాన్తో కలిసి పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం ఇప్పుడితనికి బాగా ఉపక రించింది. అంతే గాక రైతుల సమస్యల పరిష్కారానికి 1952లో రాష్ట్ర కర్షక సంఘాన్ని స్థాపించారు."తెలుగు భూమి" అనే మరొక పత్రికను 1969లో ప్రారంబించారు.

ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు.

1968లో హైకోర్టు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించారు. ఆ సందర్భంలో ఒక మహా సభ ఏర్పాటు చేయించారు. దానికి లక్షలాది మంది రాగా నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంది కూడా రావడం విశేషం.లక్ష్మి నారాయణ సాధించిన ఘన విజయాలలో ఇది ఒకటి.

స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొన్న యోధులకు పెన్షన్ ఒక వరం లాంటిది అని నమ్మేవారు లక్ష్మి నారాయణ. స్వతంత్ర భారత్ లో ఈ అవకాశాన్ని అందరు వినియోగించుకుంటున్నా.... నిజాం పాలిత ప్రాంతాల యోధులకు ఆ అవకాశం రాలేదు. దీనిపై లక్ష్మి నారాయణ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. కేంద్రం అంగీకరించక పోవడంతో లక్ష్మి నారాయణ " తెలంగాణ సమర యోధుని సత్యాగ్రహం" అని రాసిన ఒక అట్టను మెడలో వేసుకుని ప్రధాని ఇంటి ముందు నిరాహార దీక్ష చేసారు. ఢిల్లీ పత్రికలు ప్రముఖంగా ఈ అంశాన్ని ప్రచురించాయి. దాంతొ ఇందిరా గాంధి లక్ష్మి నారాయణను పిలిపించి కారణం అడగగా..... " సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను మీరు గుర్తించక పోవడాన్ని మేము అవమానంగా భావిస్తున్నాము. బ్రిటిష్ ఆంధ్ర స్వాతంత్ర్య యోధులు ఒక బ్రిటిష్ వారితోనె పోరాడారు. కాని సంస్థాన లోని యోధులు అటు సంస్థానాధీశుల తోను, ఇటు బ్రిటిష్ వారితోను పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం కాదా? హైదరాబాదు విముక్తి జరిగిన సెప్టెంబరు 17 ను స్వాతంత్ర్య దినంగా జరుపుకో మంటారా? ఒక్క హైదరాబాదు సంస్థాన ప్రజలే కాదు పలు సంస్థానాల ప్రజలు భారతీయులు కారా? అవునా? కాదా? ముందు ఇది తేల్చండి? " అని సూటిగా, దైర్యంగా ఇందిరా గాంధిని ప్రశ్నించి యోధుడు లక్ష్మి నారాయణ. దాంతో సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభించింది. ఈ యోధుడు సాధించిన అతి పెద్ద ఘన కార్యం.
నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉన్న 844 పేజీల హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించారు... దాన్ని అప్పటి భారత రాష్ట్ర పతి జైల్ సింగ్ చేత ఆవిష్కరింప జేసారు. పి.వి.నరసింహ రావు, టి. అంజయ్య, కాసు బ్రంహానంద రెడ్డి, భవనం వెంకట్రామ రెడ్డి, నలుగురు ముఖ్య మంత్రులతో ఒక పెద్ద సభను నిర్వహించారు. అయన నిర్వహించిన సభలకు ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధిపతులు, స్వాతంత్ర సమర యోధులు, దలైలామ వంటి వారు కూడా పాల్గొనే వారు. ఆ మహా యోధుడు 2010 వ సంవత్సరం ఫిబ్రవరి 25 నాడు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్....**
**9440595494**

## మాయమైపోతున్న..

# బంధాలు!

బంధాలు బలహీనపడితే సమాజం బలహీనపడుతుంది.
కుటుంబం బలహీనపడితే మనిషి ఒంటరివాడవుతాడు.
మాటలు తగ్గితే మనసుల మధ్య దూరం పెరుగుతుంది.
మానవీయత మాయమైతే నాగరికతకు అర్థమేంటి?

మనిషి ఒంటరిగా బతకడం కంటే.. ఒకరికి ఒకరు తోడుగా ఉండటమే ముందుగా నేర్చుకున్నాడు. అక్కడి నుంచే కుటుంబం బలపడింది. ఉమ్మడి ఇంట్లో తాత, నానమ్మ, తల్లిదండ్రులు, పిల్లలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు కలిసి ఉండేవారు. పండుగంటే ఇల్లంతా సందడి. పెళ్లంటే బంధువులంతా ఒకచోట. కష్టమొస్తే పిలవకముందే వచ్చేవాళ్లు. ఇంట్లో విషాదం చోటుచేసుకుంటే కన్నీరు పంచుకునే భుజాలు ఉండేవి. డబ్బు తక్కువైనా.. మనుషుల మధ్య ఆప్యాయత మాత్రం పుష్కలంగా ఉండేది.
ఇప్పుడు పరిస్థితి మారింది. చదువు, ఉద్యోగం, ఉపాధి కోసం ఊరు దాటాల్సి వస్తోంది. చిన్న కుటుంబాలు పెరిగాయి. పిల్లలు విదేశాల్లో.. తల్లిదండ్రులు స్వగ్రామాల్లో ఉండటం సాధారణమైంది. ఈ మార్పును తప్పుపట్టలేం. కానీ దూరం పెరిగేకొద్దీ అనుబంధం కూడా తగ్గిపోవడమే అసలు ఆందోళన. ఒకప్పుడు పండుగంటే ఇంట్లో అందరూ కలుసుకునేవారు. ఇప్పుడు ఫోన్‌లో ఒక సందేశం పంపితే బాధ్యత పూర్తయినట్టవుతోంది. కలిసి ఉండే ఇల్లు తగ్గింది.. కనెక్ట్ అయ్యే ఫోన్ మాత్రం పెరిగింది.

సెల్‌ఫోన్ ప్రపంచాన్ని మన చేతిలోకి తెచ్చింది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నవారిని క్షణాల్లో పలకరించే అవకాశం ఇచ్చింది. కానీ పక్కనే కూర్చున్న మనిషితో మాట్లాడే సమయం మాత్రం కరువవుతోంది. ఒకే ఇంట్లో నలుగురు.. నాలుగు ఫోన్లు. ఒకే భోజన బల్ల.. మాటలు మాత్రం తక్కువ. భార్యాభర్తలు ఎదురెదురుగా కూర్చున్నా చూపులు తెరపైనే. తల్లి పిలుపు కంటే ఫోన్‌లో వచ్చే శబ్దమే ముందుగా వినిపిస్తే.. మన జీవనశైలిని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాల్సిందే. పిల్లల పెంపకంలోనూ ఇదే పరిస్థితి. గోరుముద్ద తినిపించాలంటే ఫోన్‌లో బొమ్మ చూపించాలి. పిల్లతో మాట్లాడటానికి సమయం ఉండదు.. కానీ చేతిలో మొబైల్ పెట్టడానికి మాత్రం సమయం దొరుకుతుంది. పరికరం పిల్లను కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉంచొచ్చు. కానీ తల్లిదండ్రుల ప్రేమను మాత్రం భర్తీ చేయలేదు. పిల్లకు ఫోన్ ఇవ్వడం సులభం.. సమయం ఇవ్వడమే అసలు బాధ్యత. దాంపత్య జీవితంలో విభేదాలు కొత్తవి కావు. ఒకప్పుడు కుటుంబ పెద్దలు కూర్చొని మాట కలిపేవారు. ఇప్పుడు చిన్న అపార్థం కూడా పెద్ద గోడగా మారుతోంది. హింస, వేధింపుల విషయంలో చట్టం తన పని తాను చేయాలి. బాధితులకు న్యాయం జరగాలి. అదే సమయంలో బంధం పూర్తిగా తెగిపోయే ముందు పరస్పరం మాట్లాడుకునే అవకాశం కూడా ఉండాలి. ప్రతి సమస్యకు మౌనం పరిష్కారం కాదు.. ప్రతి సమస్యకు గొడవ కూడా పరిష్కారం కాదు.

అన్నదమ్ముల మధ్య ఆస్తి గీతలు.. అక్కచెల్లెళ్ల మధ్య అపార్థాలు.. బాల్యంలో పంచుకున్న అనుబంధాల కంటే పెద్దవవుతున్నాయి. ఒకప్పుడు ఒకే గిన్నెలో తిన్నవాళ్లు.. ఇప్పుడు ఒకరి ఇంటికి మరొకరు వెళ్లడానికి కూడా కారణం వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఆస్తి పంచుకోవచ్చు.. కానీ అనుబంధాన్ని పంచిపెట్టలేం. బంధం పత్రాల్లో కాదు.. మనసుల్లో నిలుస్తుంది.

మానవీయత పూర్తిగా మాయమైపోలేదు. ప్రమాదం జరిగినప్పుడు అపరిచితుడిని ఆసుపత్రికి తీసుకెళ్లే చేతులు ఉన్నాయి. ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టే మనసులు ఉన్నాయి. అవసరంలో రక్తం ఇచ్చే మనుషులు ఉన్నారు. అంటే మనలోని మంచితనం ఇంకా బతికే ఉంది. దానికి కొంచెం చోటిస్తే చాలు.
దానికి పెద్ద ఉద్యమాలేమీ అవసరం లేదు. రోజులో కొంతసేపు ఫోన్‌ను పక్కన పెట్టి తల్లిదండ్రులతో మాట్లాడాలి. పిల్లలతో కూర్చోవాలి. భార్యాభర్తలు ఒకరి మాట మరొకరు వినాలి. అన్నదమ్ములను పలకరించాలి. పండుగను సందేశంగా కాక.. కలయికగా మార్చాలి. పక్కింట్లో ఒంటరిగా ఉన్న వృద్ధుడిని చూసి ఒక్కసారి "బాగున్నారా?" అని అడగాలి. ఆ ఒక్క మాట కూడా ఒక మనిషికి రోజంతా తోడుగా నిలవొచ్చు.

అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు, సాంకేతికత మాత్రమే కాదు. మనిషి పక్కన మనిషి నిలబడే సంస్కారం కూడా అభివృద్ధిలో భాగమే. ప్రపంచం మొత్తం ఒక తెరపైకి వచ్చినా.. ఇంట్లోని మనుషుల మధ్య మాట లేకపోతే ఆ అనుసంధానానికి అర్థం ఏముంది?

తెరను కాసేపు పక్కనపెట్టి మనిషిని చూడాలి. సందేశాన్ని ఆపి మనసు విప్పి మాట్లాడాలి. బంధం తెగిపోయిన తర్వాత బాధపడటం కంటే.. అది తెగకముందే ఒక అడుగు ముందుకు వేయాలి. కుటుంబం నిలిస్తే సమాజం నిలుస్తుంది. మానవీయత నిలిస్తేనే మన నాగరికతకు విలువ ఉంటుంది.

**శ్రీశైలం దూడం**
**ఫ్రీలాన్స్ జర్నలిస్టు,**
**9133947176**

## పేదింటిలో విరిసిన విద్యా కుసుమం



- నీట్‌లో సత్తాచాటిన సందగల్ల పూజిత..
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.. పూజిత



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (సింగిడి):** చదువుకు పేదరికం అడ్డు కాదని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చునని నిరుపేద కుటుంబంలో పుట్టిన విద్యా కుసుమం ఎస్ పూజిత నిరూపించారు. జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన సందమల్ల రవి సుజాతల కూతురు పూజిత నీట్ లో తన సత్తా చాటి అత్యుత్తమ ఫలితాన్ని సాధించి ఎంబిబిఎస్ లో సీటు సంపాదించుకుంది. తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ తమ కూతురిని కష్టపడి చదివించి ఉన్నత స్థాయిలో నిలబెట్టాలన్న ఆ తల్లిదండ్రుల తపన నిజమైంది. తన కూతురు డాక్టర్ చదివి పేదలకు సేవ చేయాలని అది మా చిరకాల కోరిక అని ఆ తల్లిదండ్రులు సంతోషంతో తెలిపారు. తమ కూతురు పూజిత నీట్ లో సత్తా చాటి ఆల్ ఇండియాలో 23046 ర్యాంకు సాధించి ఎంబిబిఎస్ కు ఎంపికయ్యారు. తమ కూతురు కన్న కల నిజమవుతుందని ఇదే ఉత్సాహంతో ఎంబిబిఎస్ పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ముందుకు వెళుతుందని వారు తెలిపారు. తమ కూతురు పూజిత కు ఎంబిబిఎస్ లో సీటు రావడం పట్ల సంతోషంతో పట్టణంలోని శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల కలను నెరవేర్చడమే తన లక్ష్యమని వారు అందించిన ప్రోత్సాహంతో పాటు గురువులు అందించిన సహాయ సహకారాలతో నేను ఎంబిబిఎస్ లో సీటు సాధించడం జరిగిందని భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో చదువుకొని డాక్టర్ కోర్సు పూర్తి చేసి వైద్య సేవలు అందిస్తానని తన తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తానని తెలిపింది.

## భూభారతి రీ సర్వేకు ప్రజలు సహకరించాలి

### హుజురాబాద్ ఆర్డీవో జలకుమారి

### చిన్న కోమటిపల్లిలో అవగాహన సదస్సు



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (సింగిడి):** భూభారతి రీ సర్వేకు ప్రజలు సహకరించాలని ప్రజా సమస్యల పరిష్కారం కోసమే భూభారతి సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి తెలిపారు. శుక్రవారం ఇల్లంతకుంట మండలంలోని చిన్న కోమటిపల్లి గ్రామంలో భూ భారతి సర్వేపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామసభకు అధ్యక్షులుగా గ్రామ సర్పంచ్ మూడెడ్ల కుమారస్వామి ఉప సర్పంచ్ చెట్ల వినీత వార్డు మెంబర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జల కుమారి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ రావు కరీంనగర్ తాహసిల్దార్ ఇల్లంతకుంట మనోజ్ కుమార్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే హుజురాబాద్ గాజుల వెంకటరత్నం ఇల్లంతకుంట మండల గిర్దవార్ రంజిత్ రెడ్డి మండల సర్వేయర్ గాలి సత్యనారాయణ శ్రీమతి రవళిక ఏఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న కోమటిపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే లో అందరూ రైతులు పాల్గొని కాస్తూ కబ్జాలో ఉండే దున్నుతున్న భూమిని కొలతలు సరి చూసుకోవాలని తెలిపారు. తద్వారా మీ భూమి కి సంబంధించి ఉన్నటువంటి సమస్యలన్నీ తీర్చుటకు ఒక మంచి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భూభారతి కొత్త చట్టం ప్రకారం మళ్లీ సర్వే జరుగుతున్నందున రైతులందరూ సమన్వయ పరచుకొని సర్వే టీమ్ కు మీరు సహకరించి నట్లయితే పూర్తిస్థాయి సర్వే నిర్వహించి క్యూ ఆర్ కోడ్ కలిగిన ల్యాండ్ పార్సల్ మ్యాప్ మీకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తదుపరి మీకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే అట్టి సమస్యలను రాత పూర్వకముగా అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలను పరిష్కరించుట కు చాలా వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా పెరియార్ 147వ జయంతి



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (సింగిడి):** పెరియార్ ఈవీ రామసామి 147వ జయంతి సందర్భంగా ప్రజా సంఘాల, మేధావుల ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని సహచర హాస్పిటల్ లో పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉన్న సామాజిక విశ్లేషకులు మాట్లాడుతూ పెరియార్ చారిత్రక పాత్రను కొనియాడారు. పెరియార్ తన నిండు జీవితాన్నంతా సుదీర్ఘమైన సామాజిక, ఆత్మగౌరవ పోరాటాల్లోనే గడిపాడని అన్నారు. స్వాతంత్ర్య పోరాటం, ఆత్మగౌరవ పోరాటం, మహిళా విముక్తి, కులవ్యవస్థతో జరిగే అణచివేత, దక్షణాదిపై ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం, తమిళ భాషా, సంస్కృతి పరిరక్షణ, బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్ల కల్పన వంటి ఎన్నో అంశాలపైన పెరియార్ బలమైన ముద్ర ఉందని ప్రస్తుతించారు. పెరియార్ ది సామాజిక విశ్లేషణలో తత్వవేత్తల స్థాయి, రాజకీయాల్లో, పోరాటాల్లో ప్రజలను కదిలించడంలో రాడికల్ స్వభావమని అన్నారు. పెరియార్ పైన తమిళేతర రాష్ట్రాల్లో బాగా దుష్ప్రచారం జరిగిందనీ, అవేవీ నిజం కాదని, తమిళనాడులో వర్గాలకతీతంగా ఆ రాష్ట్ర ప్రజలందరికీ పెరియార్ ఎట్లా ఆరాధ్యుడయ్యాడో అధ్యయనం చేయాల్సిన అవసరం దేశంలో ఈ రోజు మరింత ఎక్కువగా ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్ తిరుపతయ్య, విద్యావేత్త డాక్టర్ పుల్లూరి సంపత్ ద్రావిడ సాహిత్య, సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపకులు కవి వాగ్గేయ కారులు రామంచ భరత్ బీఎస్పీ సీనియర్ నాయకులు మారేపల్లి మొగిలయ్య, డాక్టర్ అంబాల ప్రభాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు ఎస్ అచ్యుత్ కుమార్, ఉపాధ్యాయులు ఆవాల నరహరి, మారముల ప్రభు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి విజయం

- దానం నాగేందర్ ఫైటర్ కాదు.. చీటర్
- ఇది కెసిఆర్ బీఆర్ఎస్ పార్టీ విజయం
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (సింగిడి):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యం సాధించిన విజయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ తరఫున హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. ఇది బీఆర్ఎస్ పార్టీ విజయం.. కేసీఆర్ నాయకత్వం, బీఆర్ఎస్ పోరాటానికి దక్కిన విజయం" అని పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. దానం నాగేందర్ అనర్హత కోసం గత రెండున్నరేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ఈ తీర్పుతో ఫలితం దక్కిందన్నారు. ప్రజలను ఎల్లకాలం మోసం చేయవచ్చని సీఎం రేవంత్ రెడ్డి భావించారని, కానీ హైకోర్టు తీర్పుతో ఆ వ్యవహారానికి బ్రేక్ పడిందని అన్నారు. ఈ తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిది" అని పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. దానం నాగేందర్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల అంశంలోనూ న్యాయపరమైన పరిణామాలు ఉంటాయని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మిగతా ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, "ఏ పార్టీకి చెందినవారమో చెప్పుకోలేని పరిస్థితి ఫిరాయింపు ఎమ్మెల్యేలది" అని అన్నారు. "అమ్మా, నాన్న ఎవరో చెప్పుకోలేని పరిస్థితి పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలది" అంటూ పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తే బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని, ఖైరతాబాద్ ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ మోసాలకు తగిన తీర్పు ఇస్తారని అన్నారు. కడియం శ్రీహరి వ్యవహారంపైనా పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. "పార్టీ మారింది కడియం శ్రీహరి. అనైతికం ఎవరిది అనేది ఎథిక్స్ కమిటీ తేల్చాలి" అని అన్నారు.

**దానం నాగేందర్‌పై తీవ్ర విమర్శలు చేసిన పాడి కౌశిక్ రెడ్డి**

"దానం నాగేందర్‌కు పట్టిన గతే పార్టీ మారిన మిగతా ఎనిమిది మందికి కూడా పడుతుంది" అని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మొత్తంగా, హైకోర్టు తీర్పు పార్టీ ఫిరాయింపులపై జరుగుతున్న రాజకీయ, న్యాయ పోరాటంలో కీలక పరిణామమని ఆయన పేర్కొన్నారు.

# సానిటరీ ఇన్స్పెక్టర్‌కు తప్పని ఇబ్బందులు

- అధికార పార్టీ కౌన్సిలర్ ఆడియో వైరల్
- మున్సిపల్ కార్యాలయం ముందు పారిశుద్ధ్య కార్మికుల నిరసన
- విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని కౌన్సిలర్ భర్తపై స్టేషన్లో ఫిర్యాదు
- అధికారుల ఆదేశాల మేరకే విధుల నిర్వహణ
- సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్





**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పాలన పూర్తిగా గాడి తప్పుతుంది. జమ్మికుంట మున్సిపల్ లోని ఓ కౌన్సిలర్ మాట్లాడిన ఆడియో వైరల్ కావడంతో పాటు డీజిల్ టోకెన్లు ఇవ్వనందుకు ఓ సామాజిక వర్గానికి చెందిన సానిటరీ ఇన్స్పెక్టర్ పట్ల అవహేళన గా మాట్లాడుతున్నారని పారిశుద్ధ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకోవడంతో గతంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విచారణ చేసి ఏడుగురు ఉద్యోగులతో పాటు 32 లక్షల రూపాయలు రికవరీ చేయాలంటూ సిడిఎంఐ ద్వారా నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులు వచ్చి నెల రోజులు కాకముందే జమ్మికుంట మున్సిపాలిటీలో పలు అవకతవకలు సంఘటనలు జరగడంతో ఒకరిపై ఒకరు దూషణలు చేసుకోవడం ఫిర్యాదు చేసుకోవడం జరుగుతుంది. తాజాగా జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు సానిటరీ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న ఇల్లందుల రమేష్ అవకతవకలకు పాల్పడుతున్నాడంటూ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణ నేపథ్యంలో జమ్మికుంట మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేసే కార్మికులు తమ సామాజిక వర్గానికి చెందిన సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ పై ఆరోపణలు చేయడమే కాకుండా అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ ఫోన్లో మాట్లాడిన సంభాషణను పూర్తిగా బయట పెట్టారు. జమ్మికుంట మున్సిపల్ లోని ఓ కౌన్సిలర్ సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ కు ఫోన్ చేసి డీజిల్ టోకెన్ ఇవ్వాలని అడుగగా తన వద్ద టోకెన్లు లేవని పూర్తిస్థాయిలో కమిషనరే ఆ విషయాన్ని చూసుకుంటున్నారని చెప్పడంతో కావాలని పనిగట్టుకొని అవినీతి ఆరోపణలు చేస్తున్నారంటూ మున్సిపల్ కార్మికులు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు ఆ ఇద్దరి కౌన్సిలర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పారిశుద్ధ కార్మికులు తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని తమను అన్ని విధాలుగా బాగా చూసుకుంటున్న సానిటరీ ఇన్స్పెక్టర్ ను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్కు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం కౌన్సిలర్ ఆడియో పట్టణంతో పాటు జిల్లాలో వైరల్ గా మారింది. కాగా ఈ విషయంపై సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ స్థానిక పోలీస్ స్టేషన్లో తన విధులకు ఆటంకం కలిగించాడంటూ కౌన్సిలర్ భర్త పై ఫిర్యాదు చేయడం జరిగింది.

**అధికారుల ఆదేశాల మేరకే విధుల నిర్వహణ**
**– సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్**

జమ్మికుంట మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, పాలకవర్గం అధికారులు ఆదేశాలతో విధులు నిర్వహిస్తున్నానని ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుడు పనులు చేసే ఆలోచన లేదని అలాంటి వాటికి తాను వ్యతిరేకమని తెలిపారు. కావాలని కొంతమంది నన్ను ఇబ్బందులకు గురి చేసే విధంగా అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని కులాన్ని అడ్డం పెట్టుకొని ఉద్యోగం చేయడం లేదని అన్ని సామాజిక వర్గాలకు సేవలు అందించడమే తన కర్తవ్యం అని పేర్కొన్నారు. కొంతమంది కావాలని తనపై ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని నిజాలను ప్రజలకు చెప్పడానికి తన సిద్ధంగా ఉన్నానని ఎట్టి పరిస్థితుల్లో తలవంచి పనిచేయాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్నారు. తప్పు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని ఈ సందర్భంగా రమేష్ పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- వీణవంక పోలీసుల సేవలు అభినందనీయం
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం
- పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన సీపీ





**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (సింగిడి):** ప్రజా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణతో పాటు గణేష్ ఉత్సవాల భద్రతకు ప్రాధాన్యత ఉండాలని కరీంనగర్ సీపీ గౌష్ ఆలం అన్నారు. శుక్రవారం వీణవంక పోలీస్ స్టేషన్ లో చిల్డ్రన్ పార్క్ తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, తెలిపారు. వీణవంక మండలం కోర్కల్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం, ఉచిత కంటి వైద్య శిబిరం, వీణవంక పోలీస్ స్టేషన్‌లో చిల్డ్రన్ పార్కు ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో సీపీ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. స్థానిక ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీపీ ప్రారంభించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కును ప్రారంభించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే పిల్లలు, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఇటువంటి సౌకర్యాలు ఉపయోగపడతాయని తెలిపారు.

**గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు**

అనంతరం కోర్కల్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పలు గణేష్ మండపాలను సీపీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల వద్ద విద్యుత్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, బారికేడింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు సూచించారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు, ప్రజలు పోలీసు లకు సహకరించాలని సీపీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, జమ్మికుంట రూరల్ ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్ వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి, ఇతర పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరగాలి

- నాయిని చెరువును పరిశీలించిన సిపి గౌస్ అలం
- నిమజ్జనానికి సర్వం సిద్ధం..
- మున్సిపల్ కమిషనర్



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (సింగిడి):** ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించుకోవాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం తెలిపారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు ను హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి చైర్మన్ ప్రశాంత్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపి మున్సిపల్ కమిషనర్ కు పలు సూచనలు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తారని వారికి మున్సిపల్ సిబ్బంది సహకరించాలని సూచించారు.

**నిమజ్జనానికి సర్వం సిద్ధం**
**– మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**

జమ్మికుంట నాయిని చెరువు పై ఈనెల 23వ తేదీన జరిగే గణపతి నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ పాలకవర్గం భారీ క్రేన్ల తో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ మల్లికార్జున స్వామి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వినాయక మండప నిర్వాహకులు నిమజ్జనం రోజు సమన్వయం పాటిస్తూ క్రమ పద్ధతిలో తమ విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని అధికారులతో నిర్వాహకులు సహకరిస్తూ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ కౌన్సిలర్ పొనగంటి విష్ణు మున్సిపల్ ఏఈ వికాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మానేరు సీబీఎస్ఈలో గణనాథుడికి 108 రకాల ప్రసాదాలు

### ఘనంగా మహానివేదన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రసాదాల వితరణ



**కరీంనగర్, సెప్టెంబర్18(సింగిడి):** పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గణనాథుడికి 108 రకాల ప్రసాదాలతో ఘనంగా మహానివేదన సమర్పించారు. విద్యార్థులందరికీ గణేశుడి ఆశీస్సులు లభించాలనే సంకల్పంతో విద్యార్థులు తమ ఇళ్ల నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల ప్రసాదాలను స్వామివారికి సమర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు పెద్ద ఎత్తున ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రసాదాల సమర్పణ, వితరణ కార్యక్రమాన్ని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదాయ వసూళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

### నగరపాలక సంస్థ వ్యాపార సముదాయాల అద్దె బకాయిల వసూళ్లకు చర్యలు

### నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్, సెప్టెంబర్18(సింగిడి):** నగరపాలక సంస్థ అభివృద్ధికి ఆదాయ సేకరణ అత్యంత కీలకమని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని నగరపాలక సంస్థకు చెందిన వ్యాపార సముదాయాల అద్దెల వసూళ్లు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు, ఇతర ఆదాయ వనరులపై అధికారులతో సమీక్షించారు. సవరన్ స్ట్రీట్, శాతవాహన విశ్వవిద్యాలయం తదితర ప్రాంతాల్లోని వ్యాపార సముదాయాలకు సంబంధించిన అద్దె బకాయిల వివరాలను ప్రాంతాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల అద్దెలను గడువులోగా వసూలు చేయడంతో పాటు, పాత బకాయిల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అద్దెలు, బకాయిలు చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి, స్పందించని అద్దెదారులపై ఒప్పంద నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాపార సముదాయాల్లోని మౌలిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచే దిశగా రెవెన్యూ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆయాజ్, ఉప కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, రెవెన్యూ అధికారులు భూమానందం, నియాజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం 19-9-2026

# ఆయిల్‌పాం సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ

- వెయ్యి ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని చేరాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, సెప్టెంబర్18(సింగిడి):** జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయిల్‌పామ్ సాగును విస్తరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ఈ ఏడాది జిల్లాలో వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం రాత్రి తన ఛాంబర్‌లో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ జిల్లా మేనేజర్ చింతల రోహిత్, జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్‌తో ఆయిల్‌పామ్ సాగు పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా సాగు విస్తీర్ణం, రైతుల ప్రోత్సాహం, లక్ష్య సాధనకు చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారికి 25 ఎకరాల చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించి, రైతులను సాగు వైపు ప్రోత్సహించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్‌పామ్ సాగు విధానం, ప్రయోజనాలు, అందుబాటులో ఉన్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించి, ఒక్కో మండలంలో 50 ఎకరాల చొప్పున సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిగురుమామిడి మండలంలో సుమారు 25 ఎకరాల్లో ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన మొక్కలు అందుబాటులో ఉండేలా నర్సరీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించి రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు.



## భగత్‌నగర్‌లో వినాయక మండపాలను సందర్శించిన సునీల్‌రావు

ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదం పంపిణీ



**కరీంనగర్, సెప్టెంబర్18(సింగిడి ):** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ భగత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌రావు మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో నగర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వాహకులు ఆలకుంట వెంకటయ్య, రమేష్‌గౌడ్, వర్ధినేని వెంకట్‌రావు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 20న హైదరాబాదులో బీసీ కవుల సమ్మేళనం



**నల్లగొండ ప్రతినిధి సెప్టెంబర్ 18 (సింగిడి):** సెప్టెంబర్ 20న హైదరాబాదులో బీసీ కవి సమ్మేళనం నిర్వహించబడుతుందని ప్రముఖ కవి మాజీ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ తెలిపారు. స్థానిక జ్యోతిరావు పూలే సెంటర్లో గోడ పత్రికను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ "వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు" కవితా సంకలనం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజితోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ తెలంగాణ జీవకవి మునాస్ వెంకట్, కవి గాయకులు అంబటి వెంకన్న ఇతర కవులు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునాస్ వెంకట్ మాట్లాడుతూ 25 సంవత్సరాల కింద వెలువడినటువంటి ఈ బీసీ సంకలనం ఆనాడు ఒక ప్రభంజనాన్ని సృష్టించింది. 80 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో బీసీల ప్రాతినిధ్యం లేకుండానే ఈ పాలన కొనసాగడం ఎంతటి సిగ్గుచేటు, ఎంత అప్రజాస్వామికము ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఢిల్లీ. ఈ కార్యక్రమంలో గుండు వెంకటేశ్వర్లు, యాదగిరి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 48 డివిజన్లో 62,853 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు

- నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల స్థానంలో ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ కార్డులను తీసుకువచ్చిందని నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పచ్చల సోమేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన వారందరికీ రేషన్ కార్డును పంపిణీ చేసిందని పేర్కొన్నారు. రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులుగా డిజిటలైజేషన్ చేసి పంపిణీ చేస్తుందని తెలిపారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 48 డివిజన్లో మొత్తం 62,853 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని తెలిపారు. మూడు రోజుల పాటు అన్ని డివిజన్లో వీటిని పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం



అందిస్తున్న సన్నబియ్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ రేషన్ షాపులో బియ్యం తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ప్రత్యేక నిధుల ద్వారా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను స్మార్ట్ సిటీగా మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్పొరేషన్ ను అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే పట్టణంలోని అన్ని డివిజన్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్డు పనులు చేపట్టడం జరిగిందని, మిగిలిన పనులు కూడా జరుగుతున్నాయని అన్నారు. పానగల్ పచ్చల సోమేశ్వరాలయం నుంచి బైపాస్ రోడ్డు కూడా వేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలోని రూ. 100 కోట్లతో చేపడుతున్న బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ గుట్టల ఘాట్ రోడ్డు పనులు చురుకుగా జరుగుతున్నాయని అన్నారు. దీంతో నల్లగొండను పర్యటకంగా మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆలకుంట్ల నాగరాజు (చిట్టి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమీర్ ,ఆర్డీవో అశోక్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వంశీకృష్ణ, తహసిల్దార్ పరశురాములు, పలువురు కార్పొరేటర్లు, వార్డ్ ఆఫీసర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు

## డీజేలపై పోలీసుల కౌన్సెలింగ్



**భూపాలపల్లి బ్యూరో, సెప్టెంబర్ 18 (సింగిడి):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు భూపాలపల్లి పట్టణ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణ సీఐ చెన్నూరి శ్రీనివాస్ డీజే ఆపరేటర్లతో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ నిమజ్జన ఊరేగింపు సమయంలో డీజేలను అధిక శబ్దంతో నిర్వహించరాదని సూచించారు. అధిక శబ్దం కారణంగా వృద్ధులు, చిన్నారులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు, పోలీసుల సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక శబ్దంతో డీజేలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, డీజే ఆపరేటర్లు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని సీఐ శ్రీనివాస్ కోరారు.

# పబ్లిసిటీ ఫుల్.. పని మాత్రం నిల్!

- నర్సింహాసాగర్ పంచాయతీ ఇంచార్జి సెక్రెటరీ వెంకటరమణ తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 18 (సింగిడి):** నర్సింహాసాగర్ గ్రామ పంచాయతీ ఇంచార్జి సెక్రెటరీ వెంకటరమణ తీరుపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతలు చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా ఒక్కరోజు కూడా గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించలేదని ఆరోపిస్తు న్నారు. అయితే గ్రామంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తు న్నట్లు టీవీ ఛానళ్లలో ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని మండిపడుతున్నారు. గ్రామ వీధుల్లో మురుగు కాలువలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ వంటి చర్యలు సక్రమంగా చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు





లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పంచాయతీ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నుల సొమ్ము పంచాయతీ ఖాతాలో సక్రమంగా జమ అవుతుందా? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణతో



పాటు ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనులు చేపట్టకుండా కేవలం ప్రచారానికే పరిమితం కావడం మానుకుని వెంటనే గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నర్సింహాసాగర్ పంచాయతీ పనితీరుపై ప్రత్యేక తనిఖీ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిర్లక్ష్యం రుజువైతే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా కుంకుమపూజ

కుంకుమపూజ సౌభాగ్యానికి ప్రతీక

అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్, సెప్టెంబర్18(సింగిడి):** అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో కుంకుమ పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వావిలాలపల్లిలోని సంస్థ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణపతి మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాలక్ష్మి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలవడం ద్వారా సకల శుభాలు, ఐశ్వర్యాలు కలుగుతాయని అన్నారు. కుంకుమ పూజ సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారని, అమ్మవారి అనుగ్రహం కోసం ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం మంచి సంప్రదాయమని పేర్కొన్నారు.వేడుకల్లో భాగంగా భజన కార్యక్రమం, ప్రత్యేక దీపారాధన ర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్న సుమంగళులకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, మహిళా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సిపి గౌస్ అలం



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (సింగిడి) :** ఈనెల 23వ తేదీన జరిగే వినాయక నిమజ్జన ఏర్పాట్లను కరీంనగర్ సిపి గౌస్ అలం హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని తో కలిసి పరిశీలించారు. హుజురాబాద్ శివారు ప్రాంతంలో గల కాకతీయ కెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ముఖ్యంగా లైటింగ్ సిస్టం పటిష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జనం జరిగేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హుజరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి పట్టణ సిఐ కరుణాకర్ మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# అజ్మీర తండాలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన

**కోదాడ, సెప్టెంబర్ 18 (సింగిడి):** అనంతగిరి మండలం అజ్మీర తండాలో రూ. 20 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ అజ్మీర శ్రీవిద్య బాలకృష్ణ, మండల అధ్యక్షుడు ముసుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 200 గజాల స్థలాన్ని అందించిన దాత కంసాని నర్మదాతో శంకుస్థాపన చేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ భవన నిర్మాణానికి విలువైన స్థలాన్ని అందించిన దాత కంసాని నర్మదాను అభినందించారు. గ్రామ అవసరాలను గుర్తించి స్థలాన్ని అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల సహకారం కీలకమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, సీనియర్ నాయకులు కొండపల్లి వాసు, మాజీ ఎంపీటీసీ గింజుపల్లి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గాదె వెంకన్న, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అజ్మీర రమేష్, జెర్రిపోతుల నాగేశ్వరరావు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## 22 ఏలో నిషేధిత పేదల భూములను వెంటనే తొలగించాలి

టిడిపి ఆధ్వర్యంలో కలెక్టరేట్లో వినతిపత్రం అందజేత



**నలగొండ ప్రతినిధి సెప్టెంబర్ 18 (సింగిడి):** 22 ఏ లో నిషేధిత పేదల భూములను దాంట్లో నుంచి వెంటనే తొలగించాలని బుధవారం తెలుగుదేశం పార్టీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అనాలోచితం విధానంతో పేదల భూములను 22ఏలో చేర్చిందని దీంతో పేద రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వారు అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలవలనే ఆ పార్టీని ప్రభుత్వం ఇంట్లో కూర్చుని పెట్టిందని ఆ తప్పిదాన్ని మరలా మీరు చేస్తే మీకు కూడా అదే గతి పడుతుందని వారు హెచ్చరించారు. ప్రభుత్వం 22 ఏ లో నిషేధిత పేదల తొలగించకుంటే పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాల చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎల్వి యాదవ్, ముల్వా అరుణ్ కుమార్, వస్కుల కృష్ణయ్య, గుండు వెంకటేశ్వర్లు, తేలు రవి, చిందాల సంపత్, శీను తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రిని కరువు జిల్లాగా ప్రకటించాలి

- ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం: తీవ్ర ఇబ్బందుల్లో రైతులు
- ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్

**ఆలేరు, సెప్టెంబర్ 18 (సింగిడి):** ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఏఐకేఎంఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ అన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందని, ఇప్పటికే సాగు చేసిన పంటలకు సైతం తగినంత నీరు అందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. బుధవారం ఆలేరులో నిర్వహించిన ఏఐకేఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన



మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వం తక్షణమే పరిశీలించి యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు ప్రభావిత రైతులకు తక్షణ ఆర్థిక సహాయం, పంట నష్టపరిహారం అందించాలని కోరారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ముఖ్యంగా లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించి రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తామని బేజాడి కుమార్ తెలిపారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు మామిడాల సోమయ్య, ఉపాధ్యక్షులు ఇక్కిరి సహదేవ్, చిరబోయిన రాజయ్య, బాల మల్లేష్, మోతిలాల్, రాఘవరెడ్డి, రామచంద్రు, గోపాల్‌రెడ్డి, మురళి, పాకాల నరేష్, సరిత, మేకల వెంకటేష్, అన్రెడ్డి బాల్‌రెడ్డి, మంకయ్య, అంజిరెడ్డి, మషయ్య పాల్గొన్నారు.

## భూమికి సహజ రక్షణ కవచం ఓ జోన్ పొర

ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల ర్యాలీ



**మహాదేవపూర్, సెప్టెంబర్ 18 (సింగిడి):** ప్రపంచ ఓజోన్ పొర దినోత్సవాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర బాలికల పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ పొర ను కాపాడుకుందాం-భూమిని రక్షించుకుందాం, ఓజోన్ పొర రక్షణ అందరి బాధ్యత అంటూ నినాదాలు చేస్తూ ప్లే కార్డులను ప్రదర్శిస్తూ పాఠశాల నుండి శ్రీపాద చౌక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ హసీనాబాను, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సైన్ ఉపాధ్యాయులు మధు, ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డి లు మాట్లాడుతూ ఓజోన్ పొర పలుచపడడం వల్ల జరుగుతున్న అనర్థాలను వివరించారు. ఓజోన్ పొర సూర్యుడి నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాలను గణనీయంగా గ్రహించి భూమిపై జీవరాశులను రక్షిస్తుందని తెలిపారు. ఓజోన్ పుర తగ్గిపోతే భూమిపై పంటలు, అడవులు, జలచర జీవులపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడవచ్చు అని సూచించారు. ఓజోన్ పొరను కాపాడటంతోనే భూమిపై ఉన్న జీవరాశుల మనుగడ ఉంటుందని ఓజోన్ పొరను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# 22న విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు..

- అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, సెప్టెంబర్ 18 (సింగిడి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో పోటీల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పర్యాటక ప్రాధాన్యతతో పాటు చారిత్రక, సాంస్కృతిక విశిష్టతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచనల మేరకు తాను జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నట్లు



పేర్కొన్నారు. పోటీల నిర్వహణ కోసం జిల్లా పర్యాటక శాఖ, డీపీఆర్వో, డీఈఓ, ఇంటర్మీడియట్, డీపీఓ, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు, జిల్లా సైన్స్ అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ నెల 15న మండల స్థాయి పోటీలు నిర్వహించామని, ఈ నెల 22న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వ్యాసరచన, వక్తృత్వం, నాటిక, చిత్రలేఖనం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని విజయలక్ష్మి కోరారు. కార్యక్రమాలను నోడల్ అధికారి పర్యవేక్షణలో సంబంధిత కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి రఘు, డీపీఆర్వో శ్రీనివాస్, డీఈఓ లలిత, ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న, డీపీఓ శ్రీలత, జిల్లా సైన్స్ అధికారి స్వామి పాల్గొన్నారు.

singidinews@gmail.com
అతివ Athiva
సింగిడి

# పచ్చి టమోటాలతో లాభాలో తెలుసా?

## ఆ పోషకాల గురించి వింటే షాక్ అవుతారు!

టమోటాలో ఉండే 'లైకోపీన్' అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ క్యాన్సర్ గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. అయితే, టమోటాలు కొంత ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంటాయి, దీనివల్ల కొందరిలో జీర్ణక్రియ సమస్యలు తలెత్తవచ్చు. అందుకే పచ్చి టమోటాలను ఆహారంలో చేర్చుకునే ముందు మీ శరీర తత్వాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. పచ్చి టమోటాల వల్ల కలిగే లాభనష్టాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.



టమోటాలు తినడం వల్ల కలిగే

### 5 అద్భుత ప్రయోజనాలు:

యాంటీఆక్సిడెంట్ పవర్‌హౌస్: ఇందులోని లైకోపీన్ శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి కణజాలం దెబ్బతినకుండా కాపాడుతుంది. ఇది వయస్సు సంబంధిత కంటి సమస్యలను కూడా నివారిస్తుంది.

హైడ్రేషన్:
టమోటాలలో నీటి శాతం చాలా ఎక్కువ. ఎండకాలంలో లేదా శరీరం డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు టమోటా ముక్కలను తినడం వల్ల బాడీ హైడ్రేటెడ్‌గా ఉంటుంది.

బరువు నియంత్రణ:

తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల టమోటాలు తింటే త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునే వారికి ఇది బెస్ట్ స్నాక్ ఆప్షన్.



జీర్ణ ఆరోగ్యం:
పచ్చి టమోటాలోని ఫైబర్ మలబద్ధకాన్ని నివారించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

జాగ్రత్తలు-సాధ్యమయ్యే దుష్ప్రభావాలు:

యాసిడ్ రిఫ్లక్స్:
టమోటాలు సహజంగానే ఆమ్ల గుణాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి కడుపులో మంట, ఎసిడిటీ లేదా గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు పచ్చి టమోటాలను మితంగా తీసుకోవాలి లేదా ఉడికించి తినాలి.

అలెర్జీలు:

కొంతమందికి టమోటాలు తింటే చర్మంపై దద్దుర్లు లేదా దురద వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి వారు వైద్యుని సలహా తీసుకోవాలి.

కిడ్నీ సమస్యలు:
టమోటాలలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. కిడ్నీ వ్యాధులు ఉన్నవారు పొటాషియం స్థాయిలను అదుపులో ఉంచుకోవాలి కాబట్టి వైద్యుని సంప్రదించి తీసుకోవడం మంచిది.



చర్మ సౌందర్యం:

విటమిన్ జ పుష్కలంగా ఉండటం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి ముడతలు రాకుండా చేస్తుంది.

# మార్కెట్‌కు ఐటీ షాక్..
# 3 లక్షల కోట్ల సంపద ఆవిరి




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. అమెరికాలో జనవరి నెలకు సంబంధించి అంచనాల కంటే మెరుగైన జాబ్స్ డేటా రావడం మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. మెరుగైన జాబ్స్ డేటా వల్ల ఇప్పట్లో ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికితోడు ఐటీ షేర్లను ఏఐ భయాలు వెంటాడాయి. ఇటీవల వరుస లాభాల వేళ గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమూ సూచీలపై ఒత్తిడి పడింది.

ఐటీ స్టాక్స్‌ను ఆంత్రోపిక్ భయాలు ఇంకా వెంటాడుతున్నాయి. దీనికితోడు అమెరికాలో వెలువడిన జాబ్స్ డేటా కూడా ఐటీ షేర్లపై ప్రభావం చూపింది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోతే అమెరికన్ కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన ఐటీ కంపెనీలకు ఆర్డర్లు తగ్గుతాయి. ఈ నేపథ్యంలో నేడు ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ వంటి షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 5 శాతం మేర పతనమైంది. బీఎస్ఈలో మదుపర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు క్షీణించింది.

సెన్సెక్స్ ఉదయం 83,968.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,233.64) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 83,516.67 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 558.72 పాయింట్ల నష్టంతో 83,674.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 146.65 పాయింట్ల నష్టంతో 25,807.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.61గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5064 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






# అమెరికా – వెనెజువెలా నుంచి మరింత చమురు!

అమెరికా, వెనెజువెలా నుంచి ముడిచమురు కొనుగోళ్లు పెంచడాన్ని పరిశీలించాల్సిందిగా ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వరంగ రిఫైనరీ సంస్థలను ప్రభుత్వం కోరింది. తమతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోలు చేయడాన్ని భారత్ నిలిపి వేయనుందని అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, టెండర్ల ద్వారా స్పాట్ మార్కెట్ నుంచి చమురు కొనుగోలు చేసే సమయంలో అమెరికా గ్రేడ్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం కోరినట్లు రిఫైనరీ వర్గాలు తెలిపాయి. వెనెజువెలా ముడిచమురు విషయంలోనూ ప్రభుత్వం ఇటువంటి సూచనే చేసినట్లు వెల్లడించాయి.

అధికారిక ప్రకటనైతే లేదు
రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇంధన భద్రతకు ప్రాధాన్యమిస్తామని, దేశ అవసరాలకు అనుగుణంగా అవకాశం ఉన్న చోట కొనుగోలు చేస్తామనే మనదేశం వెల్లడించింది.

ఆ చమురు అనుకూలమేనా?
అమెరికా, వెనెజువెలా చమురు కొనుగోళ్ల విషయంలో భారత రిఫైనరీలకు పరిమితులు ఉన్నాయి. అమెరికా చమురు గ్రేడ్‌లలో తక్కువ గంధకం (సల్ఫర్) ఉంటుంది. అయితే భారత రిఫైనరీలు తమ యూనిట్లను మధ్యరకం చమురును శుద్ధి చేసేందుకు వీలుగా ఏర్పాటు చేశాయి. అందువల్ల అమెరికా చమురు ఎంతవరకు సరిపోతుందో చూడాల్సిందే. దీంతోపాటు చమురు రవాణా ఖర్చులూ అధికమవుతాయి. పశ్చిమ ఆఫ్రికా, కజకిస్థాన్ నుంచి అయితే ఖర్చు తగ్గుతుంది.

వెనెజువెలా ముడిచమురు నిల్వలను విక్రయించడంపై అమెరికా దృష్టి పెట్టింది. మనదేశం నుంచి ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం రిఫైనరీలు ఇటీవల 4 మిలియన్ బ్యారెళ్ల వెనెజువెలా ముడిచమురును దిగుమతి చేసుకున్నాయని సమాచారం.

# సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య శిబిరం

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**ప్రజా ఆరోగ్యమే లక్ష్యం.. సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్**



**సుల్తానాబాద్ (సింగిడి):** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉం డి ముందస్తు జాగ్రత్తలు పాటించా లని పెద్దపల్లి జి ల్లా ఎలిగేడు మండల వైద్యాధికారి నిస్సి క్రిస్టి యన సూచించారు. శుక్రవారం ఎలిగేడు మండలం ర్యా కల్ దేవ్ పల్లి లో ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రజ లకు వైద్య పరీక్షలు నిర్వ హించి, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల ని వారణకు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు తదితర అ నారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలి పారు. వైద్య శిబిరం ద్వారా ప్రజ లకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిం చారు. ప్రజల ఆరోగ్యాన్ని దృ ష్టిలో ఉంచుకుని ఇలాంటి శిబిరా లు నిర్వహించడం అభినందనీ యమని స్థానికులు పేర్కొన్నా రు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్, ఉప సర్పంచ్ శివకృష్ణగౌడ్, పంచాయతీ కార్యదర్శి కే. అశోక్, సీ హెచ్ఓ జీవన్ రెడ్డి, సూపర్ వైజర్ నాగమణి, ఏఎన్ఎంలు జమున, అమృత, ఆశా వర్కర్ స్వరూపతో పాటు ప్రజలు పాల్గొ న్నా రు.

# గోపాలరాజుకు శ్రీరాంపూర్‌లో ఘన స్వాగతం

**ఆస్తుల రక్షణలో ఎస్టేట్స్ కీలకం : జీఎం శ్రీనివాస్**



**మంచిర్యాల, (సింగిడి):** సింగరేణి సంస్థకు చెందిన భూములు, ఆస్తుల పరిర క్షణలో ఎ స్టేట్స్ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. సంస్థ విస్తరిస్తున్న కొద్దీ ఆస్తుల సంరక్షణ, భూము ల పరిరక్షణ, హద్దుల గుర్తింపు, ఆక్రమణల నివారణ వంటి అంశా లకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎస్టేట్స్ విభాగాన్ని మరింత సమర్థంగా నిర్వహిం చాల్సిన అవసరం ఉందని శ్రీరాం పూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జీఎం ఎ స్టేట్స్ (కార్పొరేట్)గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి గా జి. ఎస్. గోపాలరాజు శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియాలోని వివిధ విభాగాల అధిపతులు, అధికారుల సమక్షం లో జీఎం శ్రీనివాస్ ఆయనను పూలమొక్కతో, శాలువాతో ఘనంగా సత్కరించారు. పదోన్న తి పొందిన గోపాలరా జుకు శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి వంటి భారీ ప్రభుత్వ రంగ సంస్థకు ఆస్తుల పరిరక్షణ అత్యంత కీలక మని శ్రీనివాస్ అన్నారు. సంస్థకు చెందిన భూములు, ఇతర ఆస్తుల రక్షణలో ఎ స్టేట్స్ విభాగం బాధ్యత మరింత పెరుగుతోందని పేర్కొ న్నారు. విధుల్లో ఎదురయ్యే సవా ళ్లను నిబద్ధత, క్రమశిక్షణ, అనుభ వంతో అధిగమిస్తూ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. గోపాల రాజు తన అనుభవాన్ని వినియోగించి ఎస్టేట్స్ విభాగానికి సమర్థవం తమైన దిశానిర్దేశం చేయాలని జీఎం శ్రీనివాస్ సూచించారు. సంస్థ ఆస్తుల సంరక్షణతోపాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విభాగాన్ని ఆదర్శవం తంగా తీర్చిదిద్దాలని కోరారు. ఎ స్టేట్స్ నిర్వహణలో సమన్వ యం, క్రమబద్ధమైన పర్యవేక్షణ, నిరంతర అప్రమత్తత కీలకమనే అంశాన్ని ఈ సందర్భంగా ప్రస్తా వించారు. కార్యక్రమంలో ఎస్ ఓటు జీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎం (ఫైనాన్స్) శ్రీధర్, డీజీఎం (పర్స నల్) ఎస్. అనిల్‌కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, ఎస్టేట్స్ మేనే జర్ వరలక్ష్మి, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏరియా సర్వేయర్ నర్సింగ్‌రావు, లా ఆఫీసర్ మల్లేష్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# ఇచ్చోడ సీఐగా వొల్లాల ప్రవీణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**శాంతిభద్రతల పరిరక్షణ పోలీస్ ల భాద్యత..**

**వినాయక నిమజ్జనంలో అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దని సూచన**



**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో ,(సింగిడి)::** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సర్కిల్ నూతన సీఐగా వొల్లాల ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు విధులు నిర్వహించిన కే. నరేశ్ కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ప్రవీణ్ కుమార్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడు తూ.. వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలు శాంతియుత వాతావర ణంలో వేడుకలను నిర్వహించాలని ఇచ్చోడ వినాయక మండపాల నిర్వహణ సభ్యులకు సూచించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రవీణ్ కుమార్ వ్యక్తిగత నేపథ్యం : కరీంనగర్ జిల్లా 8 ఇంక్లైన్ కాలనీ కి చెందిన వొల్లాల ప్రవీణ్ కుమార్ పీజీ పూర్తి చేసిన అనంతరం పోలీస్ శాఖపై ఉన్న ఆసక్తితో కష్టపడి చదివి 2012లో ఎస్ఐగా నియమితులయ్యారు. మొదట గ ఖమ్మం జిల్లా తల్లెడలో ఎస్ఐ గా ఉదోగం లో చేరారు అనంతరం ఖమ్మంపట్టణం, సిఐడి, మంచిరియాల్, బెల్లంపల్లి వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించి 2026లో సిఐ గా పదోన్నతి పొందారు. అనంతరం నిజామాబాద్ ఇంటెలిజెన్స్ విభాగంలో విధులు నిర్వహించిన ప్రవీణ్ కుమార్ తాజాగా బదిలీపై ఇచ్చోడ సర్కిల్‌కు వచ్చి నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# బొమ్మే.. భలే పెట్రోలింగ్




**పోలీసు లేరు..కానీ నిఘా ఉన్నట్టే**

**జైపూర్ పోలీసుల వినూత్న ప్రయోగం**

**మంచిర్యాల,(సింగిడి):** రోడ్డుపై పోలీసు వాహనం కనిపిస్తే చాలు.. వాహనం వేగం తగ్గుతుంది. హెల్మెట్ సరిచూసు కుంటారు. సిగ్నల్ దాటే ముందు ఒక్కసారి ఆలోచిస్తారు. ట్రాఫిక్ నిబంధనలు గుర్తుకొస్తాయి. కానీ.. అదే రోడ్డుపై పోలీసులు కనిపిం చకపోతే కొందరిలో నిర్లక్ష్యం మొదలవుతుంది. వేగం పెరుగుతుంది. నిబంధనలు పక్కకు వెళ్తాయి. ఈ చిన్న మానసిక మార్పునే జైపూర్ పోలీసులు ప్రజల భద్రతకు అనుకూలంగా మలుచుకున్నారు. అచ్చం పోలీసు పెట్రోలింగ్ వాహనంలా కనిపించే బొమ్మలను రహదారి పక్కన ఏర్పాటు చేశారు. దూరం నుంచి చూసిన వాహనదారుడికి అది నిజమైన పోలీసు వాహనంగానే కనిపించేలా రూపొందించారు. దీంతో పెట్రోలింగ్ వాహనం ఉందన్న భావనతో చాలామంది వేగాన్ని తగ్గిస్తూ.. అప్రమత్త ంగా ప్రయాణిస్తున్నారు. చిన్న ఆలోచన.. పెద్ద ప్రయోజనానికి దారితీ స్తుందన్నట్టుగా ఈ ప్రయోగం నిలుస్తోంది. ప్రధాన రహదారులు, ప్రమాదకర మలుపులు, వాహనాలు అధిక వేగంతో దూసుకెళ్లే ప్రాంతా ల్లో ఇలాంటి నమూనాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా డ్రైవర్ దృష్టికి ముందుగా పడేది రహదారి పరిస్థితులు, ఆ తర్వాత ట్రాఫిక్ సంకేతాలు. కానీ పోలీసు వాహనం కనిపించగానే అప్రమత్తత ఒక్కసారిగా పెరుగుతుంది. అదే మానసిక స్పందనను ఈ బొమ్మ కలిగిస్తోంది. ముందు పోలీసులు ఉన్నారేమో అనే ఆలోచన వాహనదారుడి వేగాన్ని తగ్గిస్తోంది. ఒక్క క్షణం ఆగి ఆలోచించేలా చేస్తోంది. కొన్నిసార్లు ఆ ఒక్క క్షణమే ప్రమాదాన్ని తప్పించగలదు. ట్రాఫిక్ నిబంధనల అమలు అంటే కేవలం జరిమానాలు విధించడం, కేసులు నమోదు చేయడం మాత్రమే కాదు. వాహనదారులు నిబంధనలు పాటించేలా వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడం కూడా అంతే ముఖ్యం. పోలీసు వాహనం కనిపించినప్పుడు వేగం తగ్గించడం వెనుక కేవలం జరిమానా భయం మాత్రమే ఉండదు. ఎవరైనా గమనిస్తున్నారు అన్న భావన కూడా ఉంటుంది. జైపూర్ పోలీసులు ఈ అంశాన్నే గుర్తించి దాన్ని రోడ్డు భద్రతకు ఉపయోగిస్తున్నారు. ప్రతి కూడలి వద్ద, ప్రతి మలుపు వద్ద, ప్రతి ప్రమాదకర ప్రాంతంలో నిరం తరం పోలీసు సిబ్బందిని, పెట్రోలింగ్ వాహనాలను అందుబాటులో ఉంచడం సాధ్యం కాదు. సిబ్బంది పరిమితి, ఇతర విధులు, విస్తృతమైన రహదారుల కారణంగా ప్రత్యక్ష పర్యవేక్షణకు కొన్ని పరిమితులు ఉంటాయి. అలాంటి ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, వేగ పరిమితి సూచికలు, సీసీ కెమెరాలు, స్పీడ్ డిస్‌ప్లేలు వంటి వాటితోపాటు దృశ్య సంకేతాలుగా పోలీసు వాహన నమూనాలను ఉపయోగించడం ఒక అదనపు చర్యగా ఉపయోగపడవచ్చు. అయితే ఈ ప్రయోగాన్ని శాశ్వత పరిష్కారంగా చూడలేం. బొమ్మ కనిపించిందని మాత్రమే నిబంధనలు పాటించడం కంటే.. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతను తన బాధ్యతగా భావించాలి. హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, వేగ పరిమితిని పాటించడం, సిగ్నళ్లను గౌరవించడం వంటి అలవాట్లు సహజంగా మారాలి. దీనికి పోలీసుల ప్రత్యక్ష తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరికలు, నిబంధనల అమలు వంటి చర్యలు తోడైతే మరింత ప్రయోజనం ఉంటుంది.

# ఇంటింటా పింఛన్ సర్వే.. అర్హులకు చేయూత



**సుల్తానాబాద్,**(సింగిడి):: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వా ర్డు శాస్త్రినగర్‌లో చేయూత పింఛన్ పథకంలో భా గంగా మున్సిపల్ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వ హించారు. అర్హులైన పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరించి, పింఛన్‌కు సంబం ధించిన సమాచారాన్ని పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థా యిలో వివరాల సేకరణ చేపడుతున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కల్వ ల శంకరమ్మ ఓదెలు సర్వే ప్రక్రియను పరిశీలించా రు. వార్డు ప్రజ లకు ఎలాంటి ఇబ్బందులులేకుండా అర్హుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి జి. సాయి కుమార్, బిల్ కలెక్టర్ రాజ్‌కుమార్, లంక రఘు తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో రైతులకు మరింత ప్రయోజనం

**జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్**



**కొమురం భీం ఆసిఫాబాద్ (సింగిడి):** భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అన్నారు. శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం బాలేపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా భూ కొలతల అధికారి వినయ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ నక్షాలు అందుబాటులో లేని గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే పూర్తయితే భవిష్యత్తులో రైతుల మధ్య గట్ల తగాదాలకు అవకాశం ఉండదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో భూమిని కొలవడం జరుగుతుందని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను అధికారులు సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

**అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**





**కొమురం భీం (సింగిడి):** మారుమూల గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడు తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువ రాజ్ మర్మాట్ తెలిపారు. శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, లింగాపూర్ మండలం కంచనపల్లి గ్రామపంచాయతీని సందర్శించిన ఆయన తాగునీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి తాగునీటి సమస్యలు, అవసరా లను తెలుసుకున్నారు. రక్షిత తాగునీటిని వినియోగిం చకపోవడం వల్ల వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. కంచనపల్లితో పాటు పరిసర గ్రామపంచాయతీలను అనుసంధానం చేస్తూ ఉమ్మడి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశాలను పరి శీలిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అందుబాటులో ఉన్న నీటి వన రులను సమగ్రంగా పరిశీలించాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు. గ్రామాల అవసరాలకు అనుగు ణంగా ప్రణాళిక రూపొందించి రక్షిత తాగునీటి సరఫ రాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, నీతి ఆయోగ్ కో–ఆర్డినేటర్ డా. బాలరాజు రాజారాం, సర్పంచ్ కనక పార్వతి, ఉపసర్పం చ్ కనక జ్యోతి రామ్, సంబంధిత అధికారులు పాల్గొ న్నారు.

# రైతులకు అన్యాయం జరుగుతుంటే : ఎమ్మెల్యే మౌనమేల

**ధాన్యం దోపిడీపై హైకోర్టుకు**

**రైస్ మిల్లర్లు, అధికారులు గోదాం నిర్వాహకులపై న్యాయపోరాటం**

**బిజెపి నాయకుడు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి**



**సుల్తానాబాద్, (సింగిడి):** రైతులకు అన్యాయం జరుగుతున్నా ప్రజాప్రతిని ధులు ఎందుకు మౌనం వహిస్తున్నారని బీజేపీ నే త గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి ప్రశ్నించారు. రైతుల ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు, కోతలు జరుగు తున్నాయంటూ ఆరోపిస్తూ పెద్దపల్లి ఎమ్మెల్యే వి జయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనో హర్‌రెడ్డిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. శుక్ర వారం సుల్తానాబాద్ మండల కేంద్రం లోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షు డు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సురేష్‌రెడ్డి మాట్లాడారు. కొందరు సివిల్ సప్లై అధికా రులు, రైస్ మిల్లర్లు, గో దాం నిర్వాహకుల మధ్య అక్రమ ఒప్పందాలు ఉ న్నాయంటూ ఆయన ఆరోపించారు. డిఫాల్ట్‌గా ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం ఎలాకేటా యిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. రైతుకు ఒక్క క్విం టాలుపై రూ. 133 నుంచి రూ. 145 వరకు నష్టం వాటిల్లుతున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయ ని సురేష్‌రెడ్డి తెలిపారు. హమాలీ ఖర్చుల పేరుతో క్వింటాలుకు రూ. 50 వరకు వసూలు చేస్తున్నార ని, లారీల్లో అదనపు తూకం పేరుతో భారీగా కోత లు విధిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగో లు కేంద్రం నుంచి సీఎంఆర్‌కు తరలించే వరకు అ య్యే ఖర్చులను సంబంధిత వ్యవస్థ భరించాల్సి ఉన్నప్పటికీ రైతులపై అదనపు భారం మోపుతున్నారని అన్నారు. ఇటీవల జరిగిన విజిలెన్స్ తనిఖీలపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నార స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్ల అవ కతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ లకు ఫిర్యాదు చే శామని, సంబంధిత శాఖలు, అధికారులకు త్వర లో న్యాయ పరమైననోటీసులు వెళ్లే అవకాశం ఉం దని తెలిపారు. రైతుల తరఫున హైకోర్టులో రిట్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. ఎఫ్‌సీఐ నిబంధ నలు పాటించని అధికారులు, రైస్ మిల్లర్లు, గోదాం నిర్వాహకుల వ్యవహారాలను న్యాయ స్థానాల దృష్టికి తీసుకెళ్తామని సురేష్‌రెడ్డి అన్నారు. వానా కాలం సీజన్ నుంచే రైతులతో కలిసి ఆందోళనలు చేపడ తామని ప్రకటించారు. డిఫాల్ట్ మిల్లులకు ధాన్యం కేటాయింపుపై అధికారులు స్పష్టత ఇవ్వా లని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జి ల్లా ఉపాధ్యక్షుడుసొదరి మ హేం దర్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి లత, ప్రధాన కార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్‌కుమార్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మెం డే శంకరయ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలు మ ల్క భాగ్యలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు పెర్క రమేష్, నూనె మ హేష్ పటేల్, వీరగోని కిరణ్ గౌడ్, దా సరి పూర్ణచేందర్, వారికిళ్ల నాగభూషణం, అబ్బో జు రాజానందం, కరెంగుల హరీష్, ఈర్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వంశీకృష్ణకు ఘన స్వాగతం.. బలం చాటిన వర్గం





**వంశీకృష్ణ రాక.. కాంగ్రెస్ లో కొత్త సమీకరణాల చర్చ**

**మంచిర్యాల, (సింగిడి):** మంచిర్యాల జిల్లా కాంగ్రెస్‌లో వర్గ సమీకరణాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఎంపీ గడ్డం వంశీకృష్ణ జిల్లాకు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మంతెన జగన్‌మోహన్‌రావు వర్గం భారీగా స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందారం ఎక్స్‌రోడ్ వద్ద ఎంపీకి నాయ కులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి.. అక్కడి నుంచి మంచిర్యాల వరకు బైక్ ర్యాలీ చేపట్టడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు. బైక్‌లపై ర్యాలీగా మంచిర్యా లకు చేరుకున్న వారు ఐబీ వద్దకు చేరుకున్నారు. ఎంపీ వంశీకృష్ణకు అడుగడుగునా స్వాగతం పలుకుతూ తమ అనుబంధాన్ని చాటుకున్నారు. జిల్లాలో కాంగ్రెస్‌లో కొనసాగుతున్న అంతర్గత సమీకరణాల నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఎంపీ వంశీకృష్ణ శ్రీరాంపూర్‌లో సింగరేణి కార్మికుని విగ్రహానికి పూలమా ల వేసి నివాళు లర్పించారు. సింగరేణి ప్రాంతంలో కార్మికు ల సమస్యలు, వారి సంక్షేమ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నాయకులు ఆయన దృష్టికి తీసు కెళ్లారు. శ్రీరాంపూర్‌లో అంబేద్కర్ భవనం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం శ్రీరాంపూర్ అధ్యక్షుడు జల్లి సతీష్ ఎంపీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికంగా అంబేద్కర్ భవనం అవసరం, సామాజిక కార్యక్రమాలకు దాని ఉపయోగం తదితర అంశాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

**ర్యాలీ వెనుక రాజకీయ సందేశం..**

సాధారణ స్వాగత కార్యక్రమంగా ప్రారంభమైనా.. భారీ స్థాయిలో బైక్ ర్యాలీ నిర్వహించడం ద్వారా జగన్‌మో హన రావు వర్గం తన కార్యకర్తల సమీకరణ సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లయింది. ముఖ్యంగా కాంగ్రెస్‌లో వివిధ వర్గాల మధ్య రాజకీయ సమీకరణాలు కొనసాగుతున్న తరుణంలో ఎంపీ వంశీకృష్ణకు లభించిన ఈ స్వాగతం ప్రాధాన్యం

# మున్నూరు కాపు (పటేల్స్) సంఘం సభ్యత్వానికి వెబ్‌సైట్




**మంచిర్యాల,**(సింగిడి): జనాభా ఎంత ఉంటే అంత మేరకు సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యం దక్కే అవకాశం ఉంటుంది. తమ జనాభా వివరాలు పక్కాగా నమో దు చేసుకోవడం ద్వారా హక్కుల సాధనకు బలం చేకూరుతుందని మున్నూరు కాపు (పట ేల్స్) సంఘం భావిస్తోంది. ఇందులో భాగంగా కుటుంబ సభ్యత్వ నమోదుకు ప్రత్యేక వెబ్ సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. నస్పూర్ ప్రెస్‌క్లబ్ హాలులో శుక్రవారం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారాం పటేల్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడ ఉన్న మున్నూరు కాపు పటేల్స్ కుటుంబాలైనా వెబ్ సైట్ ద్వారా సభ్యత్వం తీసుకోవాలని కోరారు. తమ జనాభా ప్రాతినిధ్యం తగ్గిపోవడం వల్ల రాజకీయంగా, ఉద్యోగ–ఉపాధి రంగాల్లో వెనుకబడుతున్నామని అన్నారు.

**సంఘటితంగా ఉంటేనే బలం**

ప్రతి కుటుంబం సభ్యత్వం తీసుకుంటే సమాజంలో తమ సంఖ్యపై స్పష్టత వస్తుందని నాయకులు తెలిపారు. సంఘం పరిధిలోకి మరో ఎనిమిది కులాలను చేర్చే ప్రయత్నాలను అడ్డుకున్నామని దేవయ్య పటేల్ పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వం పొందినట్లు తేలితే గ్రామ, మండల కమిటీల ద్వారా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ తగిన నిధులు కేటాయించలేదని ఆయన ఆరోపించారు. సభ్యత్వ నమోదు ద్వారా సమాజాన్ని సంఘటితం చేసి, సమస్యలు–హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై మరింత బలంగా ఒత్తిడి తీసుకురావాలన్నది సంఘం లక్ష్యంగా కనిపిస్తోంది. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పానుగంటి శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఊర చెరువుపై ‘కబ్జా’ నీడ పై.. కౌన్సిలర్ల సమరభేరి

**ఇక పార్టీలకతీత పోరాటం**

**14 చెరువులు, కుంటలపై సమగ్రసర్వేకు మున్సిపల్ తీర్మానం**

**ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు తేల్చాలి**

**ఇరిగేషన్–రెవెన్యూ సంయుక్త సర్వే చేయాలి**

**కాలయాపన చేస్తే హైకోర్టును ఆశ్రయిస్తాం: కౌన్సిలర్లు**

**చెరువుల పరిరక్షణపై పార్టీలకతీత ఉద్యమం**



**సుల్తానాబాద్, (సింగిడి)::** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని చెరువులు, కుంటల పరిరక్షణ కోసం పార్టీలకతీతంగా మరో ఉ ద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు రెండో వార్డు కౌ న్సిలర్ గాజుల రాజమల్లు, ఏడో వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్ ప్రకటించారు. చెరువులు, కుంటలపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వ భూ ముల హద్దులను నిర్ధారించాలని కోరుతూ మున్సి పల్‌లో తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. శుక్రవారం సుల్తానాబాద్ మండల కేం ద్రంలోని గాజుల రాజమల్లు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ.. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో సుమా రు 14 చెరువులు, కుంటలు ఉన్నాయని, వీటిలో అనేక ప్రాంతాల్లో విస్తీర్ణం తగ్గిపోయిందని ఆరోపిం చారు. చెరువుల శిఖం భూములు అన్యాక్రాంత మవుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో వాటిని రియ ల్ ఎస్టేట్ అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరో పణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇరిగేషన్ – రెవె న్యూ సంయుక్త సర్వే అవసరం చెరువులు, కుం టల అసలు విస్తీర్ణం, శిఖం భూ ములు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. సర్వే అనంతరం హద్దులను అధికారికం గా నిర్ధారించి ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు అందిన వివరాల ప్రకా రం సుల్తానాబాద్ పెద్దచెరువు విస్తీర్ణం సు మారు 217 ఎకరాల 13 గుంటలు ఉండ గా ప్రస్తుతం సుమారు 90 ఎకరాలకు పరిమితమైనట్లు వారు పేర్కొన్నారు. మిగిలిన శిఖం భూముల పరి స్థితిపై సమగ్ర సర్వే ద్వారా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు.

**14 చెరువులు, కుంటలపై దృష్టి..**

చెరువులు, కుంటల పరిరక్షణకు సంబంధించిన అంశాన్ని సంబంధిత మంత్రులు, ప్రజాప్రతి నిధు లు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవ హరించాలని కోరారు.

**‘ఎంతటి వారైనా ఉపేక్షించం..**

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు సర్వేలో తేలితే, సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు కలిసి రావాలని పిలుపు నిచ్చారు. అధికారిక సర్వేలో జాప్యం జరిగితే న్యాయపరమైన మార్గాలను కూడా ఆశ్రయిస్తామని, అవసర మైతే హైకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గాదాసు రవీందర్, ఈర్ల శేఖర్, కల్వల ఓదెలు, కందునూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి విజయం



**దానం నాగేందర్ ఫైటర్ కాదు.. చీటర్**

**ఇది కెసిఆ బీఆర్ఎస్ పార్టీ విజయం : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**జమ్మికుంట, (సింగిడి):** హైదరా బాద్ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజా స్వామ్యం సాధించిన విజయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ తరఫున హైకోర్టు కు ధన్యవాదాలు తెలిపారు. ఇది బీఆర్ఎస్ పార్టీ విజయం.. కేసీఆర్ నాయకత్వం, బీఆర్ఎస్ పోరాటానికి దక్కిన విజయం" అని పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. దానం నాగేందర్ అనర్హత కోసం గత రెండున్నరేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ఈ తీర్పుతో ఫలితం దక్కిందన్నారు. ప్రజలను ఎల్లకాలం మోసం చేయవచ్చని సీఎం రేవంత్ రెడ్డి భావించారని, కానీ హైకోర్టు తీర్పుతో ఆ వ్యవహారానికి బ్రేక్ పడిందని అన్నారు. ఈ తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిది" అని పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. దానం నాగేందర్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల అంశంలోనూ న్యాయపరమె న పరిణామాలు ఉంటాయని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మిగతా ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, "ఏ పార్టీకి చెందిన వారమో చెప్పుకోలేని పరిస్థితి ఫిరాయింపు ఎమ్మెల్యేలది" అని అన్నారు. "అమ్మా, నాన్న ఎవరో చెప్పుకోలేని పరిస్థితి పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలది" అంటూ పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తే బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని, ఖైరతా బాద్ ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ మోసాలకు తగిన తీర్పు ఇస్తారని అన్నారు. కడియం శ్రీహరి వ్యవహారంపైనా పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. "పార్టీ మారింది కడియం శ్రీహరి. అనైతికం ఎవరిది అనేది ఎథిక్స్ కమిటీ తేల్చాలి" అని అన్నారు. దానం నాగేందర్‌పై తీవ్ర విమర్శలు చేసిన పాడి కౌశిక్ రెడ్డి, "దానం నాగేందర్‌కు పట్టిన గతే పార్టీ మారిన మిగతా ఎనిమిది మందికి కూడా పడుతుంది" అని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మొత్తంగా, హైకోర్టు తీర్పు పార్టీ ఫిరాయింపులపై జరుగుతున్న రాజకీయ, న్యాయ పోరాటంలో కీలక పరిణామమని ఆయన పేర్కొన్నారు.

# అనాథ పిల్లల మధ్య కలెక్టర్ ప్రియాంక గణేష్ సంబరాలు

## చిన్నారుల ముఖాల్లో విరిసిన చిరునవ్వులు

**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** అనాథ శరణాలయంలోని చిన్నారులకు పండుగ సంతోషాన్ని పంచేందుకు జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పండుగల ప్రాముఖ్యతను తెలుపుతూ, వారి జీవితాల్లో ఆనందం నింపాలనే సంకల్పంతో శరణాలయంలో వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని బారంబావి సమీపంలో గల అనాథ శరణాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమ వద్ద కలెక్టర్ చిన్నారులతో కలసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక చవితి పండుగ విశిష్టతను, పూజ ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించి, వారిలో ఆధ్యాత్మిక భావనను, నమ్మకాన్ని పెంపొందించారు. చిన్నారుల ఆనందం తలలకు కాషాయ పట్టీలు ధరించి, నీలిరంగు దుస్తుల్లో



శ్రద్ధగా నమస్కరిస్తూ పూజలో పాల్గొన్న చిన్నారుల ముఖాల్లో ఎనలేని సంతోషం కనిపించింది. పూజానంతరం పిల్లలకు పండుగ ప్రసాదాలు, తీపి పదార్థాలు పంపిణీ చేసి, వారితో కాసేపు గడిపారు. కలెక్టర్ సి హెచ్ ప్రియాంక స్వయంగా వచ్చి తమ మధ్య పండుగ



జరుపుకోవడంపై చిన్నారులతో పాటు శరణాలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. అనాథ పిల్లల పట్ల చూపిన ఈ మానవత్వం అందరికీ ఆదర్శంగా నిలిచిందనడం లో సందేహం లేదు.

# విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

**దమ్మపేట, (సింగిడి):** అశ్వారావుపేట నియోజక వర్గంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా అశ్వారావుపేట శాసనసభ్యు డు జారె ఆదినారాయణ సరికొత్త అడుగులు వేస్తున్నారు. మంగళవారం గండుగులపల్లి గ్రామంలోని తెలంగాణ ఏకలవ్య నమూనా నివాస పాఠశాలను సందర్శించి, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిచ్చేలా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'నేను సైతం చేయూత విద్యా అభివృద్ధి' పిలుపులో భాగంగా, అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన "ఎమ్మెల్యే విద్యాయాత్ర – మన ఎమ్మెల్యే మన బడి" అనే నూతన కార్యక్రమాన్ని గండుగులపల్లి గ్రామంలో అధికారికంగా ప్రారంభించారు.

**మత్తుకు దూరం – చదువుకు ప్రాధాన్యత:** ఈ క్రమంలో పోలీస్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహిం చిన 'మత్తు పదార్థాల వ్యతిరేక వారోత్సవాల' అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. "మత్తు రహిత అశ్వారావుపేట" నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. ఉన్నత ఆశయాలు, నాణ్యమైన చదువు, క్రీడలు, సృజనాత్మకతపై దృష్టి సారించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంచేందుకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

**సౌకర్యాల పరిశీలన.. అధికారులకు ఆదేశాలు:** కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, ఎమ్మెల్యే స్వయంగా పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని, విద్యా ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు.

# జాబ్‌మేళా పేరుతో నిరుద్యోగులకు టోకరా

**25 వేల ఉద్యోగాల నుంచి 3,500కు.. ఇప్పుడు ప్రైవేట్ కొలువులేనా?**

**ప్రచార ఆర్భాటాలకు ప్రజాధనం దుబారా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆరోపణ**

**సిమెంట్ ఫ్యాక్టరీల్లో ఉద్యోగాలు కల్పించకుండా జాబ్‌మేళా ఎందుకని ప్రశ్న**



**కోదాడ, (సింగిడి):** జాబ్‌మేళా పేరుతో నిరుద్యోగులను మభ్యపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆరోపించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల తీరుపై విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు జాబ్‌మేళా పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. తొలుత 25 వేల ఉద్యోగాలు, ఆ తర్వాత 3,500 ఉద్యోగాలు అంటూ ప్రచారం చేసి, చివరకు ప్రైవేట్ కంపెనీలను తీసుకొచ్చారని అన్నారు. సింగరేణి, మినరల్ ఫండ్స్, సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి నిధులు సేకరించి జాబ్‌మేళా పేరుతో ప్రచారానికి వినియోగిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ వంటి ప్రభుత్వ అధికారులను ఉపయోగించుకుంటూ పత్రికల్లో ఫుల్‌పేజీ ప్రకటనలు ఇస్తూ ప్రజాధనాన్ని దుబారా చేస్తున్నారని విమర్శించారు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లోని సిమెంట్ పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల నుంచి కమిషన్లు వసూలు చేయడానికే మంత్రి, ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. నీటిపారుదల శాఖలో అవుట్‌సోర్సింగ్ లష్కర్ పోస్టుల విషయంలోనూ అవకతవకలు జరుగుతున్నాయని, ఒక్కో పోస్టుకు రూ.3 లక్షలు వసూలు చేస్తున్నారని మల్లయ్యయాదవ్ ఆరోపించారు. ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించి కొత్తవారిని నియమిస్తున్నారని పేర్కొన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సాగునీరు, విద్యుత్ సమస్యలతో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనలో అసలు బాధ్యులను రక్షించి బీసీ వర్గానికి చెందిన ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో గ్రామాలను దత్తత తీసుకుంటామని హామీ ఇచ్చిన వారు అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం పాఠశాల, ఆలయం, బోరుబావి వంటి అభివృద్ధి పనులు కూడా చేపట్టలేదని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. మంత్రి, ఎమ్మెల్యే తీరును ప్రజలు గమనిస్తున్నారని మల్లయ్యయాదవ్ పేర్కొన్నారు.

# 22-ఏ భూములపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

**భూ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి చర్యలు**

**టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం**



**సంగారెడ్డి ప్రతినిధి, (సింగిడి):** 22(ఏ) భూముల అంశంపై బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేస్తు న్నారని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఆరోపించారు. సంగారెడ్డిలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ధరణి పోర్టల్‌ను తీసు కొచ్చి పెద్ద మొత్తంలో భూములను 22(ఏ) నిషే ధిత జాబితాలో చేర్చారని ఆయన ఆరోపిం చారు. ప్రస్తుతం నిషేధిత జాబితాలోని భూము ల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంద న్నారు. "22(ఏ)లో కోటి ఎకరాలు ఉన్నాయని కేటీఆర్, హరీష్ రావు ప్రచారం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలు తెలుసుకోవాలి" అని సత్యం శ్రీరంగం అన్నారు. భూ రికా ర్డులను పరిశీలించి అర్హత ఉన్న భూముల సమ స్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేప డుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు.

**అసైన్డ్ భూములపై విచారణ జరపాలి**

గత బీఆర్ఎస్ పాలనలో అసైన్డ్ భూముల విషయంలో అక్రమాలు జరిగాయని సత్యం శ్రీరంగం ఆరోపించారు. ధరణి వ్యవస్థను అడ్డు పెట్టుకుని భూ రికార్డుల్లో అక్రమ మార్పులు జరిగాయని విమర్శించారు. బీఆర్ఎస్ నేతల హయాంలో జరిగిన భూ వ్యవహారాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని చెప్పారు. గత పాలనలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్ పాలనపై విమర్శలు**

తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని ఆయన విమ ర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీగా నిధులు ఖర్చు చేసి రాష్ట్రంపై అప్పుల భారం పెంచారని ఆరోపించారు. అప్పుల భారం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షే మం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని సత్యం శ్రీరంగం తెలిపారు.

**దళితుల పట్ల అవమానకర వైఖరిని ఖండించాలి..**

ఫామ్‌హౌస్ వద్ద డప్పు కొట్టిన దళితుల విషయంలో గతంలో జరిగిన పరిణామాలను ఆయన ప్రస్తావించారు. దళితుల ఆత్మగౌరవా న్ని దెబ్బతీసే చర్యలను ఖండించారు. శాసన సభ స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా ఆయన తప్పుబట్టారు.

**అన్ని వర్గాల అభివృద్ధికి కృషి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి అవగాహన ఉందని సత్యం శ్రీరంగం ఆరోపిం చారు. రఘునందన్ రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని, వ్యాఖ్యానించడంపై ఆయన స్పందిస్తూ, ఈ వ్యాఖ్యలు రాజకీయంగా విరుద్ధంగా ఉన్నాయని అన్నారు.

ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు రఘు గౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, పట్టణ అధ్యక్షులు కిరణ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# జాబ్‌మేళాకు 600 మంది పోలీసులతో బందోబస్తు

**8 పార్కింగ్ కేంద్రాలు.. 5 రిజిస్ట్రేషన్ కేంద్రాలు**

**మేళా ప్రాంగణంలో 30 సీసీ కెమెరాలతో నిఘా**

**ఖమ్మం క్రాస్‌రోడ్డు నుంచి వాహనాలకు అనుమతి లేదు**





**కోదాడ, (సింగిడి):**
ఈ నెల 19న సెయింట్ జోసెఫ్ సీసీఆర్ కాన్వెంట్ విద్యాలయంలో నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాకు 600 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం మేళా ప్రాంగణం, వాహనాల మార్గా లు, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి ఒక ఎస్పీ, అదనపు ఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 45 మంది ఎస్ఐలు సహా 600 మంది సిబ్బంది విధులు నిర్వహి స్తారని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వాహనాల కోసం 8 పార్కింగ్ ప్రదేశాలు, అభ్యర్థుల కోసం 5 రిజిస్ట్రేషన్ కేంద్రాలు, మేళా ప్రాంగణంలో పోలీస్ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. 30 సీసీ కెమెరాలను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

**వాహనాల మార్గాల్లో మార్పులు**

ఖమ్మం క్రాస్‌రోడ్డు నుంచి మేళా ప్రాంగణం వైపు వాహనాలకు అనుమతి లేదని ఎస్పీ తెలిపారు. జాతీయ రహదారి మీదుగా దుర్గాపురం ఎక్స్‌రోడ్డు నుంచి కోదాడలోకి ప్రవేశించాలని సూచించారు. పోలీసుల సూచనల మేరకు నిర్దేశిత పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలను నిలిపివేయాలని, రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సాధారణ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. యువత పోలీసుల సూచనలు పాటించి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని, ఉద్యోగ మేళాకు ధైర్యంగా హాజరై అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అభ్యర్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రవి, సీఐ శివశంకర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికీ జడలు.. కనిపించని భగీరథ నీళ్లు

**గ్రామాలు, తండాల్లో తాగునీటికి కటకట**

**లీకేజీల పేరుతో నీటి సరఫరాకు బ్రేక్**


**సర్పంచుల సంతకాలతో రికార్డుల్లో నీటి సరఫరా!**

**అధికారుల పర్యవేక్షణ కరువు**

**మోతె, (సింగిడి)::** ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం మోతె మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో గ్రామ పంచాయతీల బోర్లలో నీరు తగ్గిపోయి తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండల కేంద్రంతో పాటు భిక్యాతండా, హుస్సేనాబాద్, బుర్కచర్ల, గోల్‌తండా, రవిపహాడ్, అప్పన్నగూడెం, సర్వారం, రాఘవపురం, నామవరం, భల్లు తండా తదితర ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. పక్కనే ఉన్న పాలేరు నుంచి అన్నారుగూడెం సమీపంలో మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశం ఉన్నప్పటికీ, మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో మహిళలు బిందెలు పట్టుకుని బావులు, ఇతర నీటి వనరుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పాలేరు నీటిని వినియోగించి భగీరథ ద్వారా సరఫరా చేయాలని కోరుతున్నారు.

**కేజీల పేరుతో సరఫరాకు బ్రేక్?**

సిరికొండ మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ముగ్గురు లైన్‌మెన్ ఉన్నప్పటికీ ఆవాస గ్రామాలకు నీరు అందడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పైప్‌లైన్ లీకేజీల పేరుతో నీటి సరఫరాను



నిలిపివేస్తున్నారని, ఆ సమయంలో నీటిని ఇతర ప్రాంతాలకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పైప్‌లైన్ చివరన ఉన్న గ్రామాలు, దళితవాడలు, శివారు బస్తీలకు నెలల తరబడి నీరు అందడం లేదని స్థానికులు చెబుతున్నారు.

**రికార్డుల్లో సరఫరా.. క్షేత్రస్థాయిలో కరువు**


కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందకపోయినా, సరఫరా జరుగుతున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధుల నుంచి సంతకాలు తీసుకుంటున్నారనే విమర్శలు వస్తు న్నాయి. నీటి సరఫరా తీరును ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. లీకేజీల పేరుతో జరుగుతున్న వ్యవహారాలపై విచారణ జరిపి, ప్రతి గ్రామం, తండాకు సక్రమంగా భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎమ్మెల్యే అండతో అభివృద్ధికి కొత్త బాట..

**విజయ రమణారావు చొరవతో రోడ్డు విస్తరణకు శ్రీకారం**

**పట్టణ రూపు రేఖలు మార్చే రోడ్ల విస్తరణ**

**పోలీస్‌స్టేషన్ నుంచి హనుమాన్ ఆలయం వరకు 40 అడుగుల రహదారికి మార్గం సుగమం**



**సుల్తానాబాద్, (సింగిడి):** ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహకారంతో సుల్తానాబాద్ ము న్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు సాగు తోం ది. పట్టణంలో రోడ్ల విస్తరణకు చర్యలు చేపడు తూ ప్రజలకు మెరుగైన రవాణాసౌకర్యాలు కల్పిం చేందుకు అధికా రులు కసరత్తు చేస్తున్నారు. ఇం దులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి హను మాన్ ఆలయం వరకు రోడ్డు విస్తరణకు చర్యలు ప్రారంభమ య్యాయి. రోడ్డు విస్తరణలో భాగంగా పోలీస్‌స్టేషన్ ప్రహరీ గోడను తొలగించారు. దీంతో ఈ మార్గంలో 40 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణానికి మార్గం సుగమమైంది. విస్తరణ పూర్త యితే పట్టణంలోని ప్రధాన మార్గాల్లో రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ స మస్యలు కొంతమేర తగ్గే అవకాశం ఉందని స్థాని కులు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే విజ యరమణారావు సహకారంతో పట్టణ అభివృద్ధి పనులు వేగం పుంజుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, స్థానిక సీఐ పొ న్నమనేని రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌ డ్, కౌన్సిలర్లు గాజుల రాజ మల్లు, వర ప్రదీప్, గ రిగే శోభ శ్రీనివాస్, సిద్ధ తిరుపతి, కందునూరి స మత కుమార్, ఈర్ల స్వరూప శేఖర్, గాదాసు మం జుల రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

### రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**గద్వాల బ్యూరో,(సింగిడి):** శ్రీ జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రభుత్వా నికి ప్రజాసేవలో మరింత శక్తి,సామర్థ్యం కలగాలని ప్రార్థించినట్లు తెలం గాణ రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,కమిటీ సభ్యులతో కలిసి అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాల యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాల యం సందర్శించి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ కూడా నిర్వహించారు. అనంతరం శ్రీ జోగులాంబ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు అమ్మవారి ప్రసాదం శేష వస్త్రం బహుకరించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ/ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమై, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని,ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుప డాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్థంగా చేరాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల భూములు22-ఏలో ఎందుకు పెట్టారో

## కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి



**ఖమ్మం,(సింగిడి):** ప్రజలకు సంబంధించిన భూములను 22-ఏ లో ఎందుకు పెట్టారు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాల యంలో పార్టీ నాయకులు మల్లెంపాటి అప్పారావు మాట్లాడుతూ.ప్రజలకు సంబంధించిన లక్షలాది ఎకరాల భూములు 22- ఏ జాబితాలో ఎందుకు పెట్టారో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పకుండా డొంక తిరుగుడుగా కేసీఆర్ కుటుంబ ఆస్తుల గురించి చర్చలేపి తప్పించుకోవడాన్ని తెలుగుదేశంపార్టీ తరపున ఖండిస్తున్నామని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తుల మీద ఆరోపణలు చేస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తప్పించుకు తిరుగుతుందని. ఈ రెండు పార్టీలు వారివారి ప్రభుత్వ హయాంలో 22ఏ జాబితాను అడ్డం పెట్టి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారని వారి అక్రమ సంపాదనలు బయటికి రాకుండా కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకులు ఒకరి మీద మరొకరు డమ్మీ పోరాటం చేస్తున్నారని. ఈ డమ్మీ చర్చలు ఒకరి భూముల వద్దకు మరొకరు పోవడం కాకుండా ప్రభుత్వ అధికారులతో కాకుండా హై కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ ఎందుకు వేయడం లేదు ఈ విధముగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పీడిస్తుంటే, ప్రజల పక్షాన నిలబడి నిషేధిత జాబితాలోని భూములు విడుదల చేయాలని పోరాటం చేయకుండా బిజెపి పార్టీ చోద్యం చూస్తోందని అన్నారు, ఈ విధముగా రైతుల భూముల విషయంలో కాకుండా కాంగ్రెస్ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు చేస్తున్న డైవర్షన్ రాజకీయాలను మానుకుని నిషేధిత జాబితాలో అక్రమంగా చేర్చబడిన రైతుల భూములు విడుదల చేయాలని తెలుగుదేశంపార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు, ఈ సమావే శంలో తెలుగుదేశంపార్టీ పాలేరు నియోజక వర్గ ఇంచార్జ్ కొండబాల కరుణాకర్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, సింగల్ విండో చైర్మన్ గడిపూడి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కర్నాటి అశ్వని కుమార్, రాయల కోటేశ్వర్రావు, కామినేని శ్రీనివాస రావు, పెమ్మసాని హరీష్, పరిటాల నాగార్జున, మల్లెంపాటి లహరిన్, వల్లోజి రాము తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి మృతికి న్యాయం చేయాలి..

### ఎం.జె.పీ. హాస్టల్‌లో అధ్యాపకుల వేధింపులపై ఏబీవీపీ ఆగ్రహం..



**నాగర్‌కర్నూల్ (సింగిడి):** జిల్లా కేంద్రంలోని ఎం.జె.పీ. బాలుర రెసిడెన్షియల్ హాస్టల్‌లో అధ్యాపకుడు విద్యార్థిని కొట్టడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి ఇంటికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. మృత విద్యార్థి కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంగనమోని బంగారు బాబు మాట్లాడుతూ.. హాస్టల్‌లో అనేక సమస్యలు నెలకొన్నాయని ఆరోపించారు. ఇద్దరు, ముగ్గురు అధ్యాపకులు విద్యార్థులను చిత్రహింసలకు గురిచేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతు న్నారని అన్నారు. విద్యార్థి మృతికి బాధ్యులపై చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివతో పాటు పలువురు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ కమిటీకి రూ.25 వేల సాయం



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండలంలోని చౌదర్పల్లి గ్రామంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు వెల్దండ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు 25,000 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. డీజే సౌండ్ బాక్సుల కోసం ఈ మొత్తాన్ని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు అందిం చారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. భజన కీర్తనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గణేష్ ఉత్సవాలు గ్రామంలో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందించేలా నిర్వహించాలని, యువతతో పాటు గ్రామస్తులందరూ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో చౌదర్పల్లి గ్రామ ఉప సర్పంచ్ దొబ్బల రాజీవ్, వార్డు సభ్యులు భరత్, దొబ్బల మహేష్, దొబ్బల నరేష్, దొబ్బల వంశీ, రాజేష్‌తో పాటు గ్రామ యువకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల వివరాల డిజిటలైజేషన్‌ను 100శాతం పూర్తిచేయాలి

### కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ ,(సింగిడి):** నేషనల్ డిజి టల్ లైవ్‌స్టాక్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని అన్ని పశువుల వివరాలను 100 శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయా లని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలో పశువుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన పశువుల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 31 లక్షల 6,607 పశువులు, ఇతర జంతువులు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు 78 శాతం పశువుల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...., మిగిలిన పశువుల వివరాల నమోదును వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాన్ని 100 శాతం పూర్తి చేయాలని సూచిం చారు. గ్రామాల వారీగా పశువుల వివరాల నమోదును పర్యవేక్షిస్తూ, ఎలాంటి జంతువు వివరాలు నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే వివరాలు ఖచ్చితంగా, తప్పులు లేకుండా ఉండేలా సంబంధిత సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిజిటల్ లైవ్‌స్టాక్ వివరాల నమోదుతో పశుసంవర్ధక శాఖ ద్వారా అందించే సేవలు, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, ఏడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన

### రైతు సలహా కమిటీ సమావేశంలో వ్యవసాయ శాఖ మండల అధికారి సురేష్



**కల్వకుర్తి (సింగిడి)::** కల్వకుర్తి డివిజన్ పరిధిలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వ ర్యంలో మండల స్థాయి రైతు సలహా కమిటీ సమావే శాన్ని కల్వకుర్తి రైతువేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సహాయ వ్యవసాయ సంచాలకులు మంజుల ఆధ్వర్యంలో నిర్వహించగా, మండల స్థాయి రైతు సలహా కమిటీ చైర్మన్ జి. సుదర్శన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, రైతులకు ఉపయోగకరమైన సూచనలు, సలహాలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులకు సూచనలు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ సాంకేతికతను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం, పంటల సాగులో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. సురేష్, సహాయ సాంకేతిక నిర్వహణ అధికారి అనూష, అలాగే రైతు సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వ్యవసాయాభివృద్ధికి అవసరమైన చర్యలపై సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.

### మొహమ్మద్ అలీ కుటుంబానికి


## చిన్ననాటి స్నేహితుల ఆర్థిక భరోసా



**కల్వకుర్తి,(సింగిడి):** చిన్ననాటి స్నేహానికి, మాన వత్వానికి ప్రతీకగా రఘుపతి పేటలో చదువు కున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు (2004 బ్యాచ్) తమ స్నేహితుడు, ఇటీవల మృతి చెందిన మొహ మ్మద్ అలీ కుటుంబానికి అండగా నిలిచారు. గత నెల పంజుగుల సోలార్ డ్యూటీలో విధులు నిర్వహిస్తూ మొహ మ్మద్ అలీ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన చిన్ననాటి స్నేహితులు, 2004 పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి రూ.40,000 ఆర్థిక సహాయాన్ని సేకరించి అలీ కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతే కాకుండా స్నేహితుల్లో ఒకరైన దండుగుల వెంకటేష్ పెద్ద మనసుతో ముందుకు వచ్చి అలీ కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా నిలిచేందుకు నిర్ణయించుకు న్నారు. అలీ కుమార్తెకు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు తన ఖాతా నుంచి ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని జమ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రూ.20,000 వరకు అలీ కుమార్తె లేదా కుటుంబ సభ్యుల ఖాతాలో జమ అయ్యేలా సహకరిస్తున్నట్లు వెల్లడించారు. తమ స్నేహితుడు లేని లోటును ఎవరూ భర్తీ చేయలేకపోయినా, ఆయన కుటుంబానికి తమ వంతు సహకారం అందించడం ద్వారా స్నేహబంధాన్ని కొనసాగించాలని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలిచిన చిన్ననాటి స్నేహితులందరికీ మొహమ్మద్ అలీ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. స్నేహం అంటే కేవలం కలిసి చదువుకోవడం, కలిసి తిరగడం మాత్రమే కాదని.. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

## ప్రపంచ వెదురు దినోత్సవం

### పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పనే ధ్యేయం



**నారాయణ పేట ప్రతినిధి, (సింగిడి):** ర్యావరణ పరిరక్షణలో వెదురు పాత్ర, దాని ఆధారిత ఉపాధి అవకాశాలు, వెదురు ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న ప్రపంచ వెదురు దినోత్సవం నిర్వహిస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ప్రజావాణి హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వెదురు వేగంగా పెరిగే పునరుత్పాదక వనరు. ఇది అధికంగా కార్బన్ డయాక్సైడ్ను గ్రహించి వాతావరణ సమతుల్యతను కాపాడుతుంది. నేల కోతను అరికడుతూ జీవవైవిధ్యానికి దోహదపడుతుందని అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెదురు ప్రధాన ఆధారం. సాంప్రదాయ బుట్టలు, చాపలతో పాటు ఆధునిక ఫర్నిచర్, గృహోపకరణాలు, అలంకరణ వస్తువుల తయారీ ద్వారా చేతివృత్తిదారులకు, స్వయం సహాయక సంఘాలకు మంచి ఆదాయం లభిస్తుందని తెలిపారు. పర్యావరణహితమైన వెదురు ఉత్పత్తులు ప్లాస్టిక్‌కు ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి. ప్యాకేజింగ్, నాణ్యత, మార్కెటింగ్ శిక్షణ ద్వారా వీటి వినియోగాన్ని పెంచవచ్చని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు, సహజ వెదురు అడవుల రక్షణ, యువత, మహిళలకు అవగాహన కల్పించడం ద్వారా హరిత భవిష్యత్తును నిర్మించవచ్చని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఓ అనిల్, డిపిఆర్ఓ ఎం.ఎ. రషీద్, సీపీఓ, మున్సిపల్ కమిషనర్ శంకర్, బాలాజీ, సభ్యులు సాయిబాబా, సైబా కృష్ణ, పావని, వెంకటేశ్వరమ్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌పీవోను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండలం లోని సింగిల్ విండో పరిధిలో ఉన్న రైతులందరూ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఎఫ్‌పీవో ను సద్వినియోగం చేసు కుని సంస్థను బలోపేతం చేయాలని సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు కోరారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎఫ్‌పీవోలో 750 మంది రైతులు ఒక్కొక్కరు రూ. 2 వేల చొప్పున సభ్యత్వం పొందితే మొత్తం రూ. 15 లక్షలు జమ అవుతాయని తెలిపారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ. 15 లక్షలు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. తద్వారా ఎఫ్‌పీవో మరింత బలోపేతం కావడం తో పాటు రైతులకు నాణ్యమైన పప్పు దినుసులు, విత్త నాలు అందుబా టులోకి తీసుకురావచ్చని వివరించారు. అలాగే చెర్కూర్ గ్రామంలోని సింగిల్ విండోకు చెందిన సర్వే నంబర్ 539లో ఉన్న 10 గుంటల భూమిని గుర్తించి వినియోగంలోకి తీసుకురావడంతో పాటు అక్కడ ప్రహరీ నిర్మాణం చేపట్టే అంశంపై డైరెక్టర్లతో సమావేశం నిర్వహించినట్లు భాస్కర్ రావు తెలిపారు. పెద్దాపూర్ గ్రామంలో సంస్థకు కేటాయించిన 1.39 ఎకరాల భూమికి సంబంధించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి సిఫార్సు లేఖను కలెక్టర్‌కు పంపిం చారని, త్వరలోనే సంబంధిత ప్రొసీడింగ్స్ అందనున్నాయని వెల్లడించారు. రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ ఉత్ప త్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా ఎఫ్‌పీవోను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఉమ్మడి వెల్దండ మండలంలోని రైతులందరూ సకాలంలో సభ్యత్వం నమోదు చేసుకుని సంస్థ అభివృద్ధికి సహకరించాలని భాస్కర్ రావు పిలుపునిచ్చారు


## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కేతయ్య స్వామి" విగ్రహానికి నివాళులు



**నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి):** నగరంలోని వినాయక్‌నగర్‌లోని అమరవీరుల పార్కు లో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించు కుని మహేంద్రుల ఆరాధ్య దైవం "శ్రీ కేతయ్య స్వామి" విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమా లలు వేసి నివాళ్ళర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ మహేంద్ర సంఘం జిల్లా నాయకులు, చేతి వృత్తిదారులైన మహేంద్రులకు ఎన్నో సమస్యలు ఉన్నాయని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. హరితహారం లో వెదురుని ప్రోత్సహించాలి, అడవులకు రక్షణగా వెదురు వృక్షాలను పెంచాలని, అదేవిధంగా ప్రతి నియోజకవర్గంలో మహేంద్రు లకు ఒక ఐదు ఎకరాల భూమి కేటాయించి దానిలో వెదురు పంటను పండించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒక్కసారి వెదురు పంట కొస్తే దాదాపు 50 సంవత్సరాలు వెదురుని పండించవచ్చని అన్నారు. నాణ్యమైన వెదురు దొరకక మహేంద్రులు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అస్సాం రాష్ట్రం లాంటి సుదూర ప్రాంతాల నుండి వెదురుని తేవడానికి రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయన్నారు. మహేంద్రుల చేతి వృత్తిని బ్రతికించాలంటే ప్రభుత్వాలు ప్రతి నియోజకవర్గంలో ఒక అయిదు ఎకరాలు కేటాయించి అందులో వెదురు చెట్లను పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు, దర్శనం దేవేందర్, బగ్గలి అజయ్, కొట్టూర్ చంద్రకాంత్, శ్రీలత, పద్మ, బాలన్న,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మారుమూల ప్రాంతానికీ మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు

### కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్కర్నూల్(సింగిడి):** నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల్ల అటవీ ప్రాంతంతో పాటు కలెక్టరేట్, మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ కమ్యూనికేషన్ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేసి మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బీఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో కలిసి బీఎస్ఎన్ఎల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందించేందుకు అవస రమైన ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటు, భూసేకరణ, అనుమ తులు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ముఖ్యంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కమ్యూనికేషన్ టవర్ల వల్ల వన్య ప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీ శాఖ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్ష ణకు ప్రాధాన్యతనిస్తూ టవర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు గిరిజన ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సేవలు అందేలా అవసరమైన చోట్ల బీఎస్ఎన్ఎల్ టవర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాల ద్వారా ప్రభుత్వ సేవలు, అత్యవసర సమాచారం, డిజిటల్ సేవలు ప్రజలకు మరింత సులభంగా అందు బాటులోకి వస్తాయని తెలిపారు. టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూమి, అనుమతుల విషయంలో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు బీఎస్ఎన్ఎల్ అధికారు లతో సమన్వయం చేసుకొని ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు కల్పించే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు వాసు మరికంటి, సుధీర్, సురేష్ నరసయ్య, కలెక్టరేట్ విభాగం సూపరిండెంట్ శోభ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పీ డా.వినీత్



**నారాయణపేట ప్రతినిధి,(సింగిడి):** నారా యణపేట జిల్లా పరిధిలో గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, మత సామరస్యంతో నిర్వహించు కోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలకు, గణేష్ ఉత్సవ నిర్వాహకులకు సూచిం చారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని, ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పని సరిగా పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. డీజేల స్థానంలో పరిమిత శబ్దంతో స్పీకర్లను ఉపయోగించు కోవడంతో పాటు, మన సంప్రదాయాలను ప్రతిబింబిం చేలా డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలు, ఇతర సంప్రదాయ కళారూపాలతో శోభాయాత్రలు నిర్వహిం చుకోవాలని సూచించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, సత్య యాదవ్, నందు నామాజీతో పాటు పలువురు యువకులు వచ్చారని తెలిపారు. ఎస్పీ వారితో నేరుగా మాట్లాడి గణేష్ ఉత్సవాల సందర్భంగా తీసుకోవా ల్సిన భద్రతా జాగ్రత్తలు, డీజేల నిషేధం, ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలను వివరించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణీలు, యుక్త వయస్కులు తదితరుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధిక శబ్దంతో కూడిన డీజేలను వినియోగించ కూడదని ఎస్పీ సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల మేరకు డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డీజేలను ఏర్పాటు చేసి నిబంధనలను ఉల్లంఘించినా, నిషేధ ఉత్తర్వులను ధిక్కరించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఉత్సవ నిర్వాహకులు, డీజే యజమానులు, ఆపరేటర్లు ఈ విషయాన్ని తప్పనిసరిగా గమనించాలని సూచించారు. నిబంధనల అమలులో భాగంగా నారాయణపేట జిల్లా పరిధిలో ఇప్పటివరకు 120 మంది డీజే యజమానులు, ఆపరేటర్లను పోలీసులు బైండోవర్ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

### ఇందిరమ్మ కుట్టుమిషన్ల

## దరఖాస్తుల గడువు పొడగింపు

### మేర కులస్తులకు ప్రాధాన్యం

**నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి):** తెలంగాణ ప్రభుత్వం బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి అమలు చేస్తున్న ఇంటింటా ఇందిరమ్మ కుట్టుమిషన్ల పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30 వరకు పొడగించి నట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఆటోమెటిక్ కుట్టుమిషన్ల నూరు శాతం సబ్సిడీతో ఆన్ లైన్ లో దరఖాస్తులను ఈ నెల 30 వరకు http://tgobmms. cgg.gov.in వెబ్ సెట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. నిరుద్యోగ మహిళలు, పేదలు, నిరధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులకు, అనాథ మహిళలకు, మేర కులస్తులకు, ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కచ్చితంగా తెల్లరేషన్ కార్డు కలిగిన వారికే, 5వ తరగతి పాసైన వారికి అవకాశమని తెలిపారు. కుటుంబ వార్షిక ఆధాయం గ్రామీణ ప్రాంతాల్లో 1,50,000, పట్టణ వాసులకు రూ. 2,00,000లకు లోబడిన వారు అర్హులన్నారు.

### పోషణపై ప్రతిఒక్కరూ

## అవగాహన పెంచుకోవాలి

### పోషణ మాసం సందర్భంగా తల్లులు, గర్భిణులు, కిశోర బాలికల ప్రతిజ్ఞ



**గద్వాల ప్రతినిది,(సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ కేంద్రంలోని సొంత బజార్ అంగన్వాడి సెంటర్లో పోషక మాసంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సంత బజార్ సెంటర్‌లో శుక్రవారం తల్లు లు, గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నారులతో పోషణ మాసం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పిల్లలతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఆకాశదీప్తి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని, పోషకాహార లోపంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడమే పోషణ మాసం కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన ప్రతిజ్ఞలో పాల్గొన్న వారు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, పిల్లలకు పోషకాహారం అందించడం, పరిసరాల పరిశుభ్రతను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నారులు చేపట్టిన ర్యాలీ ద్వారా ప్రజలకు పోషణపై సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు ఈశ్వరమ్మ, విమలాదేవితో పాటు తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

## మూడేళ్లయినా నిధులు శూన్యం

### అసెంబ్లీలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా ప్రత్యేక నిధులు విడుదల కాలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో నియోజక వర్గ సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి మూడు సార్లు లేఖలు ఇచ్చినా స్పష్టత లేదన్నారు. కళాభారతి, మాధవనగర్ బ్రిడ్జి పనులకు బిల్లులు చెల్లించలేక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారన్నారు. అలాగే నిజామాబాద్ బస్‌స్టాండ్ పరిస్థితి మండల కేంద్రం బస్‌స్టాండ్‌లా ఉందని, దీని అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందని విమర్శించారు. ఇక జీజీహెచ్ ప్రభుత్వ ఆసుపత్రిపై గతంలో సమీక్షలు జరిగినా పరిస్థితుల్లో మార్పు లేదన్నారు. ప్రధానంగా ఆసుపత్రి మార్చురీలో ఫ్రీజర్లు లేక దుర్వాసన వస్తోందని, జనరల్ వార్డుల్లోనూ సమస్యలు ఉన్నాయన్నారు. 800 మంది విద్యార్థులకు ఒక బాలికల ప్రభుత్వ పాఠశాల ( పబ్లిక్ స్కూల్ ) ఏర్పాటు ప్రతిపాదన చేసినా నిజామాబాద్‌లో ఇప్పటివరకు ఒక్క ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు.

## బాన్సువాడలో హెడ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలి

### కేంద్ర మంత్రికి బీజేపీ నాయకులు కోనేరూ శశాంక్ వినతి



**నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి):** బాన్సువాడ ప్రాంత ప్రజలకు మెరుగైన పోస్టల్ సేవలు అందించేందుకు ప్రస్తుత బాన్సువాడ సబ్ పోస్టాఫీస్‌ను హెడ్ పోస్టాఫీస్‌గా అప్‌గ్రేడ్ చేయాలని బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ నాయకుడు కోనేరూ శశాంక్ కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ (పోస్టల్) శాఖ సహాయ మంత్రి డా. చంద్రశేఖర్ పెమ్మసానిని కోరారు. బాన్సు వాడ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంతో పాటు మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా అభివృద్ధి చెందిందని, సబ్-కలెక్టర్ స్థాయి పరిపాలనతో పాటు డీఎస్పీ స్థాయి పోలీస్ వ్యవస్థ కూడా ఇక్కడ ఉందని తెలిపారు. బాన్సువాడ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో మిర్జాపూర్, బీర్కూర్, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పిట్లం, నిజాంసాగర్, యల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, గాంధారి తదితర 10 సబ్ పోస్టాఫీసులతో పాటు సుమారు 90 బ్రాంచ్ పోస్టాఫీసులను చేర్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ ప్రాంతాల మొత్తం జనాభా సుమారు 5.20 లక్షలు అని వివరించారు. 0ప్రస్తుతం ఈ పోస్టాఫీసులు కామారెడ్డి హెడ్ పోస్టాఫీస్, నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో ఉండటంతో పరిపాలనా పనులు, నగదు రవాణాలో అధిక దూరం ఎదురవుతోందని తెలిపారు. ముఖ్యంగా ఆసరా పెన్షన్లు,ఇతర సంక్షేమ పథకాల నగదు చెల్లింపుల్లో ఆలస్యం, నిర్వహణాపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ ఫెస్టివల్‌కు

# అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక

**జిల్లా స్థాయి దక్షిణ భారత విజ్ఞాన నాటికల పోటీల్లో ప్రథమ స్థానం**
**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి**



**కరీంనగర్, (సింగిడి):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాల విద్యా ర్థులు జిల్లా స్థాయి దక్షిణ భారత విజ్ఞాన నాటికల పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినం దన కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ, విజ్ఞానశాస్త్రం విద్యా ర్థుల జీవితంలో అంతర్భాగమని, ప్రయోగాత్మకంగా నేర్చుకోవడం ద్వారా పరిశోధనా దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచన, సృజనాత్మకత పెంపొందుతాయని అన్నారు. విజ్ఞానశా స్త్రంలోని అంశాలను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా నూతన ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులు విజ్ఞానశాస్త్రంపై పట్టు సాధించడంతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనాలని సూచించారు. రోబోటిక్స్, సమాచార సాంకేతిక రంగాలకు విజ్ఞానశాస్త్రంతో సన్నిహిత సంబంధం ఉన్నందున శాస్త్రీయ అంశాలను విశ్లేషణాత్మకంగా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని సైన్స్ టాలెంట్ మ్యూజియంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి దక్షిణ భారత విజ్ఞాన నాటికల పోటీల్లో ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు రాష్ట్రస్థా యిలోనూ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

**వీణవంక పోలీసుల సేవలు అభినందనీయం**
**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం**
**పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన సీపీ**





**జమ్మికుంట, (సింగిడి):** ప్రజా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణతో పాటు గణేష్ ఉత్సవాల భద్రతకు ప్రాధాన్యత ఉండాలని కరీంనగర్ సీపీ గౌష్ ఆలం అన్నారు. శుక్రవారం వీణవంక పోలీస్ స్టేషన్ లో చిల్డ్రన్ పార్క్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్. ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, తెలిపారు. వీణవంక మండలం కోర్కల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం, ఉచిత కంటి వైద్య శిబిరం, వీణవంక పోలీస్ స్టేషన్‌లో చిల్డ్రన్ పార్కు ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో సీపీ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వనమహోత్సవంలో భాగం గా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. స్థానిక ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సీపీ ప్రారంభించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కును ప్రారంభించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే పిల్లలు, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఇటువంటి సౌకర్యాలు ఉపయోగపడతాయని తెలిపారు.

**గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు**

అనంతరం కోర్కల్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పలు గణేష్ మండపాలను సీపీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల వద్ద విద్యుత్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, బారికేడింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు సూచించారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు. ఈకార్యక్రమంలో ఏసీపీ మాధవి, జమ్మికుంట రూరల్ ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్ వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి, ఇతర పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భూభారతి రీసర్వేకు ప్రజలు సహకరించాలి

**హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి**
**చిన్నకోమటిపల్లిలో అవగాహన సదస్సు**



**జమ్మికుంట(సింగిడి):** భూ భారతి రీసర్వేకు ప్రజలు సహకరించాలని ప్రజా సమస్యల పరిష్కారం కోసమే భూభారతి సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి తెలిపారు. శుక్రవారం ఇల్లంతకుంట మండలంలోని చిన్న కోమటిపల్లిలో భూ భారతి సర్వేపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామసభకు అధ్యక్షులుగా గ్రామ సర్పంచ్ మూడెడ్ల కుమారస్వామి ఉప సర్పంచ్ చెట్ల వినీత వార్డు మెంబర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జల కుమారి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ రావు కరీంనగర్ తాహసిల్దార్ ఇల్లంతకుంట మనోజ్‌కుమార్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే హుజురాబాద్ గాజుల వెంకటరత్నం ఇల్లంతకుంట మండల గిర్దావార్ రంజిత్‌రెడ్డి మండల సర్వేయర్ గాలి సత్యనారాయణరవళిక ఏఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న కోమటిపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేలో అందరూ రైతులు పాల్గొని కాస్తూ కబ్జాలో ఉండే దున్నుతున్న భూమిని కొలతలు సరి చూసుకోవాలని తెలిపారు. తద్వారా మీ భూమి కి సంబంధించి ఉన్నటువంటి సమస్యలన్నీ తీర్చుటకు ఒక మంచి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భూభారతి కొత్త చట్టం ప్రకారం మళ్లీ సర్వే జరుగుతున్నందున రైతులందరూ సమన్వయ పరచుకొని సర్వే టీమ్ కు మీరు సహకరించినట్లయితే పూర్తిస్థాయి సర్వే నిర్వహించి క్యూ ఆర్ కోడ్ కలిగిన ల్యాండ్ పార్సల్ మ్యాప్ మీకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తదుపరి మీకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే అట్టి సమస్యలను రాత పూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలను పరిష్కరించుటకు చాలా వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# పేదింటిలో విరిసిన విద్యాకుసుమం

**నీట్‌లో సత్తా చాటిన సందగల్ల పూజిత..**
**ప్రజలకు మెరుగైన వైద్యసేవలు**
**అందించడమే లక్ష్యం: పూజిత**





**జమ్మికుంట, (సింగిడి):** చదువుకు పేద రికం అడ్డు కాదని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చునని నిరుపేద కుటుంబంలో పుట్టిన విద్యా కుసుమం ఎస్ పూజిత నిరూపించారు. జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన సందమల్ల రవి సుజాతల కూతురు పూజిత నీట్‌లో తన సత్తా చాటి అత్యుత్తమ ఫలితాన్ని సాధించి ఎంబిబిఎస్‌లో సీటు సంపాదించుకుంది. తల్లిదండ్రు లది వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ తమ కూతురిని కష్టపడి చదివించి ఉన్నత స్థాయిలో నిలబెట్టాలన్న ఆ తల్లిదం డ్రుల తపన నిజమైంది. తన కూతురు డాక్టర్ చదివి పేదలకు సేవ చేయాలని అది మా చిరకాల కోరిక అని ఆ తల్లిదండ్రులు సంతోషంతో తెలిపారు. తమ కూతురు పూజిత నీట్ లో సత్తా చాటి ఆల్ ఇండియాలో 23046 ర్యాంకు సాధించి ఎంబిబిఎస్ కు ఎంపికయ్యారు. తమ కూతురు కన్న కల నిజమవుతుందని ఇదే ఉత్సాహంతో ఎంబిబిఎస్ పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ముందుకు వెళుతుందని వారు తెలిపారు. తమ కూతురు పూజిత కు ఎంబిబిఎస్ లో సీటు రావడం పట్ల సంతోషంతో పట్టణంలోని శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల కలను నెరవేర్చడమే తనలక్ష్యమని వారు అందించిన ప్రోత్సాహంతోపాటు గురువులు అందించిన సహాయ సహకారాలతో నేను ఎంబిబిఎస్‌లో సీటు సాధించడం జరిగిందని భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో చదువుకొని డాక్టర్ కోర్సు పూర్తి చేసి వైద్య సేవలు అందిస్తానని తన తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తానని తెలిపింది.

# భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే**
**సర్వే చేపట్టాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, (సింగిడి):** భూముల రీసర్వేను నిబంధనల ప్రకా రం పకడ్బందీగా నిర్వ హించి, రైతులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం చిగురుమా మిడి మండలం ఉల్లం పల్లిలో కొనసాగుతున్న భూముల రీసర్వేను కరీంనగర్ ఆర్డీఓ షర్మిలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్.. సర్వేకు ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా సమాచారం అందించాలని, వారి సమక్షంలోనే భూముల హద్దులను పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సాంకేతిక పరికరాలతో సర్వే నిర్వహిస్తున్నందున హద్దుల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రీసర్వే పూర్తయితే భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఉల్లంపల్లిలో రెండు బృందాలు సర్వే నిర్వహిస్తుండగా ఇప్పటివరకు 605 ఎకరాల భూమిని సర్వే చేసినట్లు తహసీల్దార్ కనకయ్య వివరించారు. ఆయిల్‌పామ్ నర్సరీకి స్థల పరిశీలన,అనంతరం ఉల్లంపల్లిలోని ఓదెల మల్లన్నగుట్ట వద్ద ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ షర్మిల, తహసీల్దార్ కనకయ్యను స్థలానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు, అధికారిక విధానాలను పాటిస్తూ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

**హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం ప్రకటించిన**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**



**కరీంనగర్,(సింగిడి):** విఘ్నేశ్వ రుడి ఆశీస్సులతో కరీంనగర్ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వ ర్యాలతో వర్ధిల్లాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన తన సతీమణి రేఖతో కలిసి నగరంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతినగర్ లోని హనుమాన్ సంతోష్ మాత ఆలయంలో గణనాథుడిని దర్శించుకున్న అనంతరం ప్రకాశం గంజ్, కోతిరాంపూర్, వెంకటేశ్వర కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, భారత్ టాకీస్ సమీపంలోని వినాయక మండపాలను సందర్శించారు. మండపాల నిర్వాహకులు, స్థానిక ప్రజలు ఆయన దంపతులకు స్వాగతం పలికి సత్కరించారు. నగరంలో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని రాజేందర్‌రావు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు చెప్పారు.

హౌసింగ్ బోర్డు కాలనీలోని వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని రాజేందర్‌రావు ప్రారంభించి భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం మండప నిర్వాహకులు, భక్తులతో మాట్లాడారు.

**హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షలు..**

జ్యోతినగర్‌లోని హనుమాన్ సంతోష్ మాత ఆలయ ప్రాంగణంలో పునర్నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి రూ.5 లక్షల విరాళం అందించనున్నట్లు రాజేందర్‌రావు–రేఖ దంపతులు ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. విరాళం ప్రకటించినందుకు కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్, ఆలయ కమిటీ ప్రతినిధులు రాజేందర్‌రావు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కార్పొరేటర్లు పడాల శ్రీజ అజయ్, పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, ఆకుల నందిని ఉదయ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వెలిచాల యువసేన నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరగాలి

**నాయిని చెరువు ను పరిశీలించిన సిపి గౌస్ అలం**
**నిమజ్జనానికి సర్వం సిద్ధం.. మున్సిపల్ కమిషనర్**




**జమ్మికుంట(సింగిడి):** ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించుకోవాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం తెలిపారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు ను హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి చైర్మన్ ప్రశాంత్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపి మున్సిపల్ కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తారని వారికి మున్సిపల్ సిబ్బంది సహకరించాలని సూచించారు.

**నిమజ్జనానికి సర్వం సిద్ధం: మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**

జమ్మికుంట నాయిని చెరువు పై ఈనెల 23వ తేదీన జరిగే గణపతి నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ పాలకవర్గం భారీ క్రేన్ల తో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ మల్లికార్జున స్వామి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని వినాయక మండప నిర్వాహకులు నిమజ్జనం రోజు సమన్వయం పాటిస్తూ క్రమ పద్ధతిలో తమ విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని అధికారులతో నిర్వాహకులు సహకరిస్తూ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ కౌన్సిలర్ పొనగంటి విష్ణు మున్సిపల్ ఏఈ వికాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడిని దర్శించుకున్న బండి సంజయ్

**ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి..**
**మేయర్, డిప్యూటీ మేయర్**



**కరీంనగర్,(సింగిడి):** గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలోని అశోక్‌నగర్ వినాయక మండపాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సు లతో రాష్ట్ర, దేశ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు కూడా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను వారు అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గొట్టెముక్కుల ఉమారాణి వెంకటరమణ, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు కేంద్ర మంత్రి, మేయర్, డిప్యూటీ మేయర్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సానిటరీ ఇన్స్పెక్టర్‌కు తప్పని ఇబ్బందులు

**అధికార పార్టీ కౌన్సిలర్ ఆడియో వైరల్ ..**
**మున్సిపల్ కార్యాలయం ముందు**
**పారిశుద్ధ్య కార్మికుల నిరసన**
**విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని కౌన్సిలర్**
**భర్తపై స్టేషన్లో ఫిర్యాదు.. అధికారుల ఆదేశాల**
**మేరకే విధుల నిర్వహణ :**
**సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్**





**జమ్మికుంట, (సింగిడి):** జమ్మి కుంట మున్సిపల్ పాలన పూర్తిగా గాడి తప్పు తుంది. జమ్మికుంట మున్సిపల్ లోని ఓ కౌన్సిలర్ మాట్లాడిన ఆడియో వైరల్ కావడంతో పాటు డీజిల్ టోకెన్లు ఇవ్వనందుకు ఓ సామాజిక వర్గానికి చెందిన సానిటరీ ఇన్స్పెక్టర్ పట్ల అవహే ళన గా మాట్లాడుతున్నారని పారిశుద్ధ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకోవడంతో గతంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విచారణ చేసి ఏడుగురు ఉద్యోగులతో పాటు 32 లక్షల రూపాయలు రికవరీ చేయాలంటూ సిడిఎంఎ ద్వారా నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులు వచ్చి నెల రోజులు కాకముందే జమ్మికుంట మున్సిపాలిటీలో పలు అవకతవకలు సంఘటనలు జరగడంతో ఒకరిపై ఒకరు దూషణలు చేసుకోవడం ఫిర్యాదు చేసుకోవడం జరుగుతుంది. తాజాగా జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు సానిటరీ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న ఇల్లందుల రమేష్ అవకతవకలకు పాల్పడుతున్నాడంటూ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణ నేపథ్యంలో జమ్మికుంట మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేసే కార్మికులు తమ సామాజిక వర్గానికి చెందిన సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ పై ఆరోపణలు చేయడమే కాకుండా అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ ఫోన్లో మాట్లాడిన సంభాషణను పూర్తిగా బయట పెట్టారు. జమ్మికుంట మున్సి పల్ లోని ఓ కౌన్సిలర్ సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ కు ఫోన్ చేసి డీజిల్ టోకెన్ ఇవ్వాలని అడుగగా తన వద్ద టోకెన్లు లేవని పూర్తిస్థాయిలో కమిషనరే ఆ విషయాన్ని చూసుకుంటున్నారని చెప్పడంతో కావాలని పనిగట్టుకొని అవినీతి ఆరోపణలు చేస్తున్నారంటూ మున్సిపల్ కార్మికులు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు ఆ ఇద్దరి కౌన్సిలర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పారిశుద్ధ కార్మికులు తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని తమను అన్ని విధాలుగా బాగా చూసుకుంటున్న సానిటరీ ఇన్స్పెక్టర్ ను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్కు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం కౌన్సిలర్ ఆడియో పట్టణంతో పాటు జిల్లాలో వైరల్ గా మారింది. కాగా ఈ విషయంపై సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ స్థానిక పోలీస్ స్టేషన్లో తన విధులకు ఆటంకం కలిగించాడంటూ కౌన్సిలర్ భర్త పై ఫిర్యాదు చేయడం జరిగింది.

**అధికారుల ఆదేశాల మేరకే విధుల నిర్వహణ: సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్**

జమ్మికుంట మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, పాలకవర్గం అధికారులు ఆదేశాలతో విధులు నిర్వహిస్తున్నానని ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుడు పనులు చేసే ఆలోచన లేదని అలాంటి వాటికి తాను వ్యతిరేకమని తెలిపారు. కావాలని కొంతమంది నన్ను ఇబ్బందులకు గురి చేసే విధంగా అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని కులాన్ని అడ్డం పెట్టుకొని ఉద్యోగం చేయడం లేదని అన్ని సామాజిక వర్గాలకు సేవలు అందించడమే తన కర్తవ్యం అని పేర్కొన్నారు. కొంతమంది కావాలని తనపై ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని నిజాలను ప్రజలకు చెప్పడానికి తన సిద్ధంగా ఉన్నానని ఎట్టి పరిస్థితుల్లో తలవంచి పనిచేయాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్నారు. తప్పు చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని ఈ సందర్భంగా రమేష్ పేర్కొన్నారు.

# కామన్ స్కూల్ విధానంతోనే విద్యలో సమానత్వం

**ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి..**
**మౌలిక వసతులు, నిధులు, సమగ్ర పాఠశాలలపై**
**విద్యావేత్తల సూచనలు**
**రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, విద్యా వ్యవస్థ ప్రణాళిక కమిషన్**
**చైర్మన్ ఆకునూరి మురళి**



**కరీంనగర్,(సింగిడి):** రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవ స్థను బలోపేతం చేసేందుకు సమగ్ర సంస్కరణలు చేపట్టాలని విద్యా వేత్తలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు కోరారు. విద్యా వ్యవస్థ సంస్కరణలపై ఫిల్మ్‌భవన్‌లో శుక్రవారం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతులు, విద్యా బడ్జెట్, పాఠశాలల ఏకీకరణ తదితర అంశాలపై చర్చించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, విద్యా వ్యవస్థ ప్రణాళిక కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్రంలో అనేక రకాల పాఠశాల విధానాలు ఉండటం వల్ల విద్యలో అసమానతలు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన కామన్ స్కూల్ విధానం అమలు చేయాలని సూచించారు. జనాభా ప్రాతిపదికన ప్రతి మండలంలో మూడు సమగ్ర పాఠశాలలను ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,000 పాఠశాలలను నిర్మించాలని ప్రతిపాదించారు. ఒక్కో పాఠశాలకు సుమారు రూ.15 కోట్ల చొప్పున మొత్తం రూ.6వేల కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టవచ్చు న్నారు. పాఠశాలలను కేవలం పేర్లు మార్చడం లేదా కొత్త పథకాలు ప్రకటించడం ద్వారా కాకుండా, విద్యార్థులకు అవసరమైన ప్రహరీ గోడలు, సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక వసతులు కల్పించడం ద్వారా అభివృద్ధి చేయాలన్నారు. పాఠశాలల నిర్మాణంలో కాంట్రాక్టర్ల జోక్యాన్ని తగ్గించి, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించాలని న్యాయవాది ప్రకాష్ ఒల్లల అన్నారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని సృజన యాదవ్ కోరారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు వీరబ్రహ్మ మాట్లాడుతూ, పాఠశాలల్లో ముందుగా సరైన మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ధర్మేంద్ర విద్యా ఉద్యమాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఉపాధ్యాయ సంఘాల సహకారంతో పాఠశాలల అభివృద్ధికి నిధుల సేకరణ చేపట్టాలని సూచించారు. విద్యా సమస్యలను స్వీకరించేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కోరారు.

రిటైర్డ్ ఆర్‌డీఓ ఈశ్వర్ తాళ్లపల్లి మాట్లాడుతూ, 1 నుంచి 8వ తరగతి వరకు పాఠశాలలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉచిత విద్య, వాహన రవాణా కల్పించాలని సూచించారు. 9 నుంచి ఇంటర్మీడియట్ వరకు సమగ్ర విభాగంగా నిర్వహించాలని, కులాల ఆధారంగా పాఠశాలలు ఏర్పాటు చేయరాదని అన్నారు.

ఉపాధ్యాయుడు సుంకిశీల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులను బోధనేతర పనులు, నివేదికలతో ముంచెత్తకుండా పూర్తిస్థాయిలో బోధనకు వినియోగించాలని కోరారు. మార్వాడీ సుదర్శన్ మాట్లాడుతూ, కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పరిస్థితి రావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాలని శ్రీనివాస్ కోరారు. విద్యా పరిరక్షణకు ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వు తీసుకురావాలని పందిళ్ల శంకర్ సూచించారు. ప్రతి వెయ్యి కుటుంబాలకు ఒక ప్రభుత్వ పాఠశాల అందుబాటులో ఉండాలని జగన్మోహన్‌రావు అన్నారు. పాఠశాలల వర్గీకరణలకు బదులుగా అందరికీ సమాన విద్య అందించే విధానం అవసరమని రాజమల్లు కోల పేర్కొన్నారు. విద్యా రంగంపై ప్రభుత్వం సమీక్షలకు మాత్రమే పరిమితం కాకుండా అవసరమైన నిధులు విడుదల చేయాలని శంకర్ కోరారు. విద్యను హక్కుగా భావించి, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం చైతన్యంతో ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. సమావేశంలో చంపాలాల్ ఐఏఎస్ రిటైర్డ్, ప్రొఫెసర్ పద్మజా షా, కోహెడ చంద్రమౌళి, అడ్వకేట్ శ్రీధర్, బోయిన అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



**మల్లాపూర్, (సింగిడి):** ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి బోగ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మల్లాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను సేకరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్‌సీని ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కొక్కుల రాంచంద్రం మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేస్తూ వెంటనే జీఓ విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చింత వెంకట సత్యప్రకాశ్, మండల అధ్యక్షుడు బందరకంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లావుడ్య రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# నేను ఏ భాషలోనూ పర్‌ఫెక్ట్ కాదు..

### ట్రోల్స్‌పై స్పందించిన రష్మిక

వివిధ రకాల భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు నటి రష్మిక అయితే, తాను పక్కా ప్రణాళికతో ఇతర ఇండస్ట్రీల్లోకి అడుగుపెట్టలేదని, తన ప్రయాణం అనుకోకుండా జరిగిపోయిందని ఆమె వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రష్మిక.. తన యాసపై వచ్చిన ట్రోలింగ్స్‌పై స్పందించారు.

తన మాతృభాష 'కొడవ తక్' అని, ఆ భాషకు సినిమా ఇండస్ట్రీ లేకపోవడం వల్లే అన్ని భాషలనూ తన సొంత భాషల్లా భావిస్తానని చెప్పుకొచ్చారు. "తొలుత నా అభిమానులే నన్ను తెలుగు, ఆ తర్వాత హిందీ చిత్రాలు చేయాలని కోరారు. అలా నా కెరీర్ విస్తరించింది" అని తెలిపారు.

ఆ సమస్యతో స్కూల్‌లో తరచూ కళ్లుతిరిగి పడిపోయేదాన్ని..: శ్రుతిహాసన్

తన యాసపై నెట్టింట వచ్చే ట్రోల్స్‌ను చూసి తానూ నవ్వుకుంటానని రష్మిక చెప్పారు. "నిజం చెప్పాలంటే నాకు ఏ భాషలోనూ పూర్తిగా పట్టు లేదు. నాకు అన్నీ కొద్దికొద్దిగా తెలుసంతే. కానీ, ఏదీ పర్‌ఫెక్ట్‌గా రాదు. అయితే, ప్రేక్షకులతో వాళ్ల భాషలోనే మాట్లాడుతూ వారిని గౌరవించాలన్నదే నా తాపత్రయం" అని ఆమె వివరించారు. అనవసర విమర్శలతో ఏకాగ్రత కోల్పోనని, సెట్‌కు వెళ్లి తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెడతానని అన్నారు.

ప్రస్తుతం ఆమె రెండు యాక్షన్ థ్రిల్లర్ సినిమాలు చేస్తున్నారు. తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'రణబాలి' షూటింగ్ ఇటీవల పూర్తికాగా.. తను ప్రధాన పాత్రలో నటిస్తున్న మరో చిత్రం 'మైసా' ముస్తాబవుతోంది. ఇక, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథని తెరపైకి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక నటించనున్నట్లు మేకర్స్ ఇటీవల అధికారికంగా ప్రకటించారు. 'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అమ్మ' పేరుతో ఈ బయోపిక్ రూపొందనుంది.

సినిమా సింగిడి Cinma Singidi

శనివారం
19-9-2026

## కంగారు పడకండి

### తదుపరి అప్‌డేట్ త్వరలోనే రాబోతోంది.. శ్రీనిధి శెట్టి ఇంట్రెస్టింగ్ పోస్ట్



విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శకుటుంబం'. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ఫ్రైవల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ మూవీ అక్టోబర్ 2న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఇందులో భాగంగా అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన చిత్ర బృందం ఇప్పటికే విడుదల చేసిన అప్డేట్స్‌తో సినిమాపై హై బజ్ క్రియేట్ అయింది. అదే జోష్‌తో రీసెంట్‌గా టీజర్ రిలీజ్ చెయ్యగా నెట్టింట సూపర్ రెస్పాన్స్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే తాజాగా శ్రీనిధి శెట్టి తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా డైరెక్టర్ త్రివిక్రమ్‌తో ఉన్న కొన్ని స్పెషల్ ఫొటోలను పంచుకుంటూ.. 'అందరిలోనూ ప్రత్యేకమైన త్రివిక్రమ్ సార్‌తో.. ఎంతో సౌమ్యులు, గొప్ప వ్యక్తిత్వం కలవారు.. ఆయన రచనలు అస్సలు ఆగవు.. కానీ కంగారు పడకండి, తదుపరి అప్‌డేట్ త్వరలోనే రాబోతోంది' అంటూ చెప్పుకొచ్చింది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతున్నది

## వాళ్ల నమ్మకమే నాలో కాన్ఫిడెన్స్‌ను పెంచింది..

### బిగ్‌బాస్ ఫేమ్ తనూజ కామెంట్స్ వైరల్



టీవీ సీరియల్స్, రియాల్టీ షో బిగ్‌బాస్ ద్వారా గుర్తింపు తెచ్చుకున్న తనూజ పుట్టుస్వామి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హతః'. పౌర్ణమి ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌తో కలిసి హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్‌లో నిర్మిస్తున్న ఈ సినిమాకు అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్నారు. కుష్బు, రెహమాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టుస్వామి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ నవంబర్ 6న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ చిత్ర టీజర్‌ను హైదరాబాద్‌లో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా తనూజ పుట్టుస్వామి మాట్లాడుతూ.. 'మనం మూవీస్‌కు కథ ఇలా ఉంది అలా ఉంది అని చెప్పుకుంటూ ఉంటాం. కానీ ఈ సినిమా కథను చెప్పడం కంటే స్క్రీన్ మీద చూస్తేనే బాగుంటుంది. ఈ సినిమాలో నటించే అవకాశం రావడం చాలా హ్యాపీగా ఉంది. నేను బిగ్ బాస్‌కు వెళ్లకముందే చేసిన చిత్రమిది. ఈ సినిమా కంటెంట్ మీద చాలా నమ్మకంతో ఉన్నాను. బిగ్ బాస్ తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూస్‌లో కూడా ఇదే విషయం చెప్పాను. ఈ టీమ్‌తో మూడేళ్లు జర్నీ చేశాను. ఈ సినిమా డైరెక్టర్ అనూష్ గారి డ్రీమ్. ఆయన కథ చెప్పినప్పటి కంటే స్కెచ్‌లతో డీటెయిల్డ్‌గా చెప్పినప్పుడు కథలో ఇంత డెప్త్ ఉందా అనిపించింది. వీళ్లకు ఈ ప్రాజెక్ట్ మీద ఉన్న నమ్మకమే నాలోనూ కాన్ఫిడెన్స్ పెంచింది. నవంబర్ 6న 'హతః'తో థియేటర్స్‌లో కలుద్దాం' అంటూ చెప్పుకొచ్చింది.

## ఆ సమస్యతో స్కూల్‌లో తరచూ కళ్లుతిరిగి పడిపోయేదాన్ని..



శ్రుతిహాసన్

మహిళలు ఎదుర్కొనే పీసీఓఎస్, ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడే నటీమణుల్లో శ్రుతి హాసన్ ఒకరు. తాజాగా నటి సోహా అలీఖాన్ నిర్వహించిన ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె.. పాఠశాల రోజుల్లో నెలసరి సమయంలో తాను పడిన ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. పీరియడ్స్ కారణంగా చాలా సమస్యలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు.

"13 ఏళ్ల వయసులో నాకు మొదటిసారి పీరియడ్స్ వచ్చాయి. ఆ విషయం చెప్పగానే అమ్మ ప్రేమగా చూసింది. పైకి, అలా ఉన్నా, అమ్మలో ఏదో ఆందోళన కనిపించింది. పీరియడ్స్ వచ్చిన రెండు గంటల్లోనే నాకు తీవ్రమైన కడుపునొప్పి మొదలైంది. అమ్మ కూడా ఇలాంటి నొప్పులనే అనుభవించారట. ఆ లక్షణాలు నాకు కూడా రావడం చూసి తను ఎంతో బాధపడ్డారు. అప్పట్లో ఆ నొప్పులు నాకు నరకంలా అనిపించేవి. పీరియడ్స్ సమయంలో పాఠశాలలో వాంతులు చేసుకోవడం, కళ్లు తిరిగి పడిపోవడం జరిగేది. నొప్పులు తట్టుకోలేక ప్రతి నెలా ఆసుపత్రికి వెళ్లి ఐవీ ఫ్లూయిడ్స్, పెయిన్‌కిల్లర్స్ తీసుకోవాల్సి వచ్చేది. అప్పట్లో నేను చాలా సన్నగా ఉండేదాన్ని. రక్తహీనతతో ఎక్కువగా ఇబ్బంది పడ్డా" అని శ్రుతిహాసన్ వెల్లడించారు. సినిమాల్లోకి వచ్చాక కూడా ఈ సమస్యల వల్ల తాను ఎంతో ఇబ్బంది పడ్డానని ఆమె తెలిపారు.

యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ నుంచి కథానాయకుడిగా.. సుహాస్ ఎమోషనల్ పోస్ట్

"నెలసరి సమయంలో డ్యాన్స్‌లు, యాక్షన్ సన్నివేశాలు చేయడం చాలా కష్టంగా ఉండేది. పక్కకు వెళ్లి వాంతులు చేసుకునేదాన్ని. నొప్పి తగ్గడానికి వాడే బలమైన మందుల వల్ల మత్తుగా, అయోమయంగా అనిపించేది. 2020లో ఓ వైద్యుడుని సంప్రదించాక నా పరిస్థితి కాస్త మెరుగైంది. అప్పట్లో వాడిన మందులతో నొప్పి 60 శాతం మేర తగ్గింది. అయితే, కొవిడ్ సమయంలో హైదరాబాద్‌లో ఒంటరిగా ఉన్నప్పుడు కడుపునొప్పి వల్ల మెట్లపైనే స్పృహ కోల్పోయా. ఆ తర్వాత డాక్టర్ సలహాతో వేరే మందులు వాడడంతో ఈ సమస్యను అదుపులో ఉంచుకోగలుగుతున్నాను" అని శ్రుతిహాసన్ వివరించారు

singidinews@gmail.com

### సంక్రాంతి బరిలో "పిక్నిక్"..

### సరికొత్త సినిమా ప్రకటించిన సక్సెస్‌ఫుల్ నిర్మాణ సంస్థ



అత్యంత ఇష్టపడే 'ప్రేమలు' అండ్ 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' తర్వాత భావనా?స్టూడియోస్ తదుపరి చిత్రాన్ని ప్రకటించింది. ప్రముఖ నటుడు ఫహద్ ఫాజిల్, దర్శకుడు దిలీష్ పోతన్, రైటర్ శ్యామ్ పుష్కరన్ కలిసి నిర్మిస్తున్న ఈ మూవీకి గోవింద్ వసంత్ సంగీతం అందిస్తున్నాడు. 'ప్రేమలు' అండ్ 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' చిత్రాలకు కో-రైటర్‌గా పనిచేసిన కిరణ్ జోసీ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను రివీల్ చేస్తూ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ కామెడీ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ మూవీకి పిక్నిక్ అనే వినూత్నమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఇందులో సందీప్ ప్రదీప్, ఇంద్రజిత్ సుకుమారన్, దిలీష్ పోతన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఇక టైటిల్ పోస్టర్‌తో పాటు.. ఈ క్రేజీ ఫ్యామిలీ కామెడీ డ్రామా 2027 జనవరి 14న మలయాళం, తమిళం, తెలుగు మరియు కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతున్నట్లు ప్రకటించారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737